నాంపల్లి ఫర్నిచర్ షాప్ అగ్నిప్రమాదం




PCW తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd

పరకాల పట్టణం 9 వార్డ్ కౌన్సిలర్‌గా బత్తుల మల్లేశం నామినేషన్..




Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 34 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- శనివారం 31 జనవరి 2026

## తెలంగాణ రైజింగ్ 2047

# లక్ష్యాల సాధనకు కృషి

**అన్ని శాఖలు నిర్దేశిత లక్ష్యంతో ముందుకు సాగాలి**

**వ్యవసాయ, మత్స్య, కార్మిక శాఖలతో సిఎస్ సమీక్ష**





**హైదరాబాద్,జనవరి 30 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్యాల మేరకు అన్ని ప్రభుత్వ విభాగాలకు దిశానిర్ధేశం చేసేందుకు గత మూడు రోజులుగా విభాగాల వారీగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు సమీక్ష నిర్వహించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు, ఈ రోజు వ్యవసాయం, సహకార, పశుసంవర్ధక, డెయిరీ అభివృద్ధి, మత్స్య, అటవీ, పర్యావరణం, శాస్త్ర సాంకేతిక, ఆహార, పౌర సరఫరాల, కార్మిక, ఉపాధి, శిక్షణ, ఫ్యాక్టరీలు, జి.ఎ.డి సర్వీసెస్ శాఖలపై డా.బి.ఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఉన్నతాధికారులతో సమీక్షించారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, తెలంగాణ విజన్ 2047 కార్యాచరణ ప్రణాళికను దృష్టి లో పెట్టుకొని నిర్ధేశిత లక్ష్యాలను చేరుకోవాలని మిగతా2లో...





## మహాత్మాగాంధీ

# 78వ వర్ధంతి

**● రాజ్‌ఘాట్ వద్ద నివాళి అర్పించిన రాష్ట్రపతి,ప్రధాని ● మహాత్ముడికి నివాళి అర్పించిన చంద్రబాబు**

**న్యూఢిల్లీ,జనవరి 30 (పిసిడబ్ల్యూ న్యూస్):** మహాత్మా గాంధీ 78వ వర్ధంతి సందర్భంగా రాజ్ ఘాట్‌లో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, ప్రధాని నరేంద్ర మోదీసహా పలువురు ప్రముఖులు గాంధీకి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రముఖులు, రిటైర్డ్ అధికారులు, సామాజిక కార్యకర్తలు, విద్యార్థులు కూడా పాల్గొన్నారు. రాజ్‌గాట్‌లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడుతూ, జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయనకు నా హృదయపూర్వక నివాళులు అర్పిస్తున్నాను. ఆయన విలక్షణ వ్యక్తిత్వం, విజయాలు మన దేశస్థులకు ఎల్లప్పుడూ సరైన మార్గాన్ని చూపిస్తూ ప్రేరణగా ఉంటాయి. అభివృద్ధి చెందిన, స్వావలంబన భారతదేశం కోసం మన సంకల్పానికి ఆయన చిహ్నంగా నిలుస్తారని తెలిపారు.మహాత్మా గాంధీ జీవితం నిజాయితీ, సత్యాగ్రహం, అహింసా మార్గదర్శకలు మరియు సామాజిక న్యాయం కోసం చేసిన ప్రేరణాత్మక ప్రయత్నాలతో గుర్తింపు పొందింది. ఆయన వ్యక్తిత్వం మరియు విజ్ఞానం యువత, ప్రజలకి సామాజిక సమతా, దేశభక్తి మరియు స్వావలంబన పట్ల ప్రేరణగా మిగతా2లో...



## ఆర్థికమంత్రిగా

# నిర్మలమ్మ రికార్డు

**వరుసగా తొమ్మిదోసారి బడ్జెట్ సమర్పణ**

**అత్యధికసార్లు ప్రవేశ పెట్టిన మహిళా మంత్రిగా ఘనత**

**న్యూఢిల్లీ,జనవరి 30 (పిసిడబ్ల్యూ న్యూస్):** నిర్మలా సీతారామన్ ఆర్థికమంత్రిగా చరిత్ర సృష్టించేందుకు సిద్ధమయ్యారు. ఫిబ్రవరి 1న ఆమె పార్లమెంటులో బడ్జెడెట్ ప్రవేశపెట్టనున్న విషయం తెలిసిందే. ఆర్థిక మంత్రిగా నిర్మలా సీతారామన్ వరుసగా ప్రవేశపెట్టనున్న 9వ బడ్జెట్ ఇది. పార్లమెంటులో 9 సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టిన రికార్డు మాజీ మంత్రి పి.చిదంబరం సొంతం. 1996లో అప్పటి ప్రధాని మిగతా2లో...

## హార్వర్డ్ వర్సిటీలో

# సిఎం రేవంత్ శిక్షణ

**- వారం రోజుల సర్టిఫికెట్ కోర్సు పూర్తి**



**హైదరాబాద్,జనవరి 30 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికాలో ప్రతిష్ఠాత్మక హార్వర్డ్ యూనివర్సిటీలోని కెన్నెడీ స్కూల్ ఆఫ్ గవర్నమెంట్‌లోఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్‌ను విజయవంతంగా పూర్తి చేశారు. లీడర్ షిప్ అనే కోర్సును పూర్తిచేసి సంబంధిత ధ్రువీకరణ పత్రాన్ని పొందారు. జనవరి 25న ఈ కోర్సు ప్రారంభమవగా జనవరి 30 వరకు అంటే వారం రోజుల పాటు నిర్వహించారు. ఈ కోర్సులో సీఎం రేవంత్‌తో పాటు 62 మంది కోహోర్ట్ విద్యార్థులు కూడా పాల్గొన్నారు. దాదాపు 20కి పైగా దేశాల నుంచి ప్రతినిధులు ఇందులో భాగస్వాములయ్యారు.

అమెరికాలోని కేంబ్రిడ్జ్‌లో మైనస్ 24 డిగ్రీల తీవ్ర చలిలోనూ రేవంత్ రెడ్డి ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు తరగతులకు హాజరయ్యారు. కేస్ స్టడీలు, గ్రూప్ డిస్కషన్లు, కన్సల్టేటివ్ వర్క్‌లతో మిగతా2లో...




## వెదురు కర్రలే దైవాలుగా..

# గద్దెలే గర్భగుడులుగా...

**● కోట్లాది హృదయాలను ఏకం చేస్తున్న జాతర ● మేడారం మహా జాతరకు ప్రముఖుల రాక ● గవర్నర్, డిజిపి, మంత్రుల దర్శనాలు**

# కెసిఆర్‌కు సిట్ షాక్

- మరోమారు నోటీసులు జారీ
- ఫామ్‌హౌజ్ విచారణ కుదరదని స్పష్టీకరణ
- నందినగర్ ఇంట్లోనే విచారిస్తామని వెల్లడి
- ఆదివారం 3గంటలకు విచారణకు సిద్దంగా ఉండాలని నోటీస్
- న్యాయనిపుణులతో చర్చించి నోటీసులు ఇచ్చిన సిట్

**హైదరాబాద్,జనవరి 30 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించి తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు బిగ్ షాక్ తగిలింది. సిట్ అధికారులు శుక్రవారం మరోసారి ఆయనకు నోటీసులు ఇచ్చారు. ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కాకుండా హైదరాబాద్‌లోనే కేసీఆర్‌ను విచారించాలని నిర్ణయించారు. ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు విచారణకు అందుబాటులో ఉండాలని తెలిపారు. కాగా, నిన్న( గురువారం) సిట్ అధికారులు కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చిన సంగతి తెలిసిందే. నందినగర్‌లోని కేసీఆర్ నివాసానికి సిట్ అధికారులు వెళ్లి నోటీసులు అందజేశారు. శుక్రవారం మధ్యాహ్నం 3:00 గంటలకు విచారణకు అందుబాటు లో ఉండాలని నోటీసులో స్పష్టం చేశారు. ఎర్రవల్లిలోని తన ఫామ్ హౌస్ లోనే విచారించాలన్న కేసీఆర్ అభ్యర్థనను మిగతా2లో...






## మహారాష్ట్ర డిప్యూటీ సీఎంగా సునేత్ర పవార్..

**- రేపే ప్రమాణస్వీకారం..!**

**మహారాష్ట్ర,జనవరి 30 (పిసిడబ్ల్యూ న్యూస్):** మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ దుర్మరణంతో నెలకొన్న రాజకీయ శూన్యతకు తెరపడింది. తదుపరి ఉపముఖ్యమంత్రి ఆయన భార్య సునేత్ర పవార్ నియామకం ఖరారైంది. దివంగత అజిత్ దాదా స్థానంలో ఆమె శనివారం ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడం ఖాయమని మిగతా2లో...

## జలశక్తి కమిటీ ముందు

# ముగిసిన భేటీ



**పోలవరం, నల్లమలసాగర్ ప్రాజెక్టును తొలగించాలి**

**కమిటీ ముందు తెలంగాణ డిమాండ్**

**న్యూఢిల్లీ,జనవరి 30 (పిసిడబ్ల్యూ న్యూస్):** కేంద్ర జలవివాదాల పరిష్కార కమిటీ సమావేశం ముగిసింది. దాదాపు రెండు గంటలపాటు ఈ భేటీ జరిగింది. 12 అంశాలు చేర్చాలని తెలంగాణ ప్రభుత్వం మిగతా2లో...

## తెలంగాణ నీటి ప్రయోజనాలను

# వదులుకోం

- పోలవరం-నల్లమలసాగర్ లింక్ ప్రాజెక్టు పై చర్చే లేదు
- హరీష్ రావు నిజాలు తెలుసుకుని మాట్లాడాలి
- పదేళ్లలో సాగునీటి రంగాన్ని భ్రష్టు పట్టించిన బిఆర్ఎస్
- మండిపడ్డ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**హైదరాబాద్,జనవరి 30 (పిసిడబ్ల్యూ న్యూస్):** కేంద్ర జలసంఘం ఛైర్మన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పోలవరం-నల్లమలసాగర్ లింక్ ప్రాజెక్టు అంశాన్ని అధికారులు మిగతా2లో...

# ఆర్థికమంత్రిగా నిర్మలమ్మ రికార్డు

(మొదటి పేజీ తరువాయి)

హెచ్‌డీ దేవగౌడ సారథ్యంలో మంత్రి చిదంబరం తొలిసారిగా బడ్జెట్ ను ప్రవేశపెట్టారు. ఆ తరువాత 1997లో రెండోసారి, 2004-08 మధ్య కాలంలో వరుసగా ఐదు సార్లు, 2013, 2014ల్లో మరో రెండు సార్లు ఆయన బడ్జెట్ ప్రవేశపెట్టారు. ఇక లోక్‌సభలో అత్యంత సుదీర్ఘ బడ్జెట్ ప్రసంగం చేసిన మంత్రిగా నిర్మలా సీతారామన్ ఇప్పటికే అరుదైన గుర్తింపును సొంతం చేసుకున్నారు. భారత్‌కు సంబంధించిన తొలి బడ్జెట్‌ను 1860లో అప్పటి ఆర్థిక మంత్రి జేమ్స్ విల్సన్ ప్రవేశపెట్టారు. భారత మండలి సభ్యుడిగా ఆయన ఈ బడ్జెట్‌ను తీసుకొచ్చారు. 1857 సిపాయి తిరుగుబాటు అనంతరం, భారత ఆర్థిక వ్యవస్థలో సంస్కరణల పేరిట వలసపాలకులు ఈ బడ్జెట్‌ను తీసుకొచ్చారు. ఇక స్వాతంత్ర్యానంతరం, 1947 నవంబర్ 26న భారత దేశ ఆర్థిక మంత్రి ఆర్‌కే షణ్ముఖం చెట్టి తొలి బడ్జెట్‌ను పార్లమెంటులో ప్రవేశపెట్టారు. అత్యధిక సార్లు బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన రికార్డును మాజీ ప్రధాని మొరార్జీ దేశాయ్ సొంతం చేసుకున్నారు. మొత్తం 10 బడ్జెట్‌లను ఆయన పార్లమెంటు ముందుకు తెచ్చారు. 1959-64 మధ్యకాలంలో ఆర్థిక మంత్రిగా ఆరు సార్లు, ఆ తరువాత 1967-1969 మధ్య మరో నాలుగు సార్లు ప్రవేశపెట్టారు. ఇక ప్రణబ్ ముఖర్జీ కూడా వివిధ మొత్తం 8 బడ్జెట్‌లను ప్రవే శపెట్టారు. 1982-84 మధ్యకాలంలో వరుసగా మూ డు సార్లు, ఆ తరువాత 2009-12 మధ్య వరుసగా ఐదు సార్లు బడ్జెట్‌ను తీసుకొచ్చారు. ఇక మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ వరుసగా ఐదు సార్లు పీవీ నరసింహారావు ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఇప్పుడు తొమ్మిదోసారి నిర్మలమ్మ బడ్జెట్ తో ముందుకు రానున్నరు. ఈ మూడేళ్లు ఆమె ఆర్థికమంత్రిగా కొనసాగితే రికార్డు సృష్టించడం ఖాయం.

# తెలంగాణ నీటి ప్రయోజనాలను వదులుకోం

(మొదటి పేజీ తరువాయి)

పూర్తిగా వ్యతిరేకించినట్టు తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. నదీ జలాల్లో తెలంగాణ ప్రయోజనాలు పరిరక్షించేలా అవసరమైన వాదనలను అధికారులు వినిపించారని చెప్పారు. పోలవరం - బనకచర్ల లేదా నల్లమలసాగర్‌కు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని శుక్రవారం నాటి సమావేశంలో సీడబ్ల్యూసీ ఛైర్మన్ స్పష్టంగా చెప్పారన్న మంత్రి... గతంలో కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ కూడా లిఖితపూర్వకంగా తెలిపారని అన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ హయాంలో తెలంగాణకు నీటి వాటాల్లో నష్టం జరిగిందని ఆరోపించారు. కృష్ణా, గోదావరి నదీ జలాల్లో తెలంగాణ ప్రభుత్వం చుక్క నీరు కూడా వదులుకోదని.. తెలంగాణ నీటి హక్కుల కోసం సర్వశక్తులు ఒడ్డుతూ పోరాడుతున్నట్లు వివరించారు. నీటి వాటాలపై చర్చలకు తాము సిద్ధమేనని అన్నారు. దిల్లీ సమావేశం గురించి మాజీమంత్రి హరీశ్ రావు తెలుసుకొని మాట్లాడితే బాగుండేదని ఉత్తమ్ సూచించారు. బీఆర్ఎస్ హయాంలో కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా కేవలం 60, 70 టీఎంసీలను మాత్రమే వ్యవసాయానికి ఉపయోగించారని.. రూ.లక్ష కోట్లు ఖర్చు పెట్టి లక్ష ఎకరాలకు కూడా నీరు ఇవ్వలేదని విమర్శించారు. నీటిపారుదల రంగాన్ని సర్వనాశనం చేసిన బీఆర్ఎస్ నేతలు తమను విమర్శించడం విడ్డూరంగా ఉందని ఆక్షేపించారు. ఆదిత్యనాథ్ దాస్ గురించి పదేపదే మాట్లాడడం తగదన్న ఆయన... తెలంగాణ ప్రాజెక్టులపై పూర్తి అవగాహన ఉన్నందుకే ఆదిత్యనాథ్ దాస్‌ను ప్రభుత్వ సలహాదారుగా పెట్టుకున్నట్లు వివరించారు. కేంద్ర జల వివాదాల పరిష్కార కమిటీ సమావేశం దాదాపు రెండు గంటల ఈ భేటీ సాగింది. ఈ అంశంపై తెలంగాణ ఇరిగేషన్ సెక్రటరీ రాహుల్ బొజ్జా మాట్లాడుతూ.. తెలంగాణ నుంచి 12 అంశాలు చర్చించాలని ప్రతిపాదించామన్నారు. పోలవరం నల్లమల్ల సాగర్ ప్రాజెక్టును అజెండాలో పెట్టొద్దని స్పష్టం చేసినట్లు తెలిపారు. రెండు రాష్ట్రాల మధ్య పలు జల వివాదాలు ఉన్నాయి.. కృష్ణా, గోదావరి జలాలపై అనేక అంశాలు ఉన్నాయి, అందుకే సమావేశానికి వచ్చామని వెల్లడించారు. ఈ సమావేశంలో ఏపీ తన అజెండాను చెప్పలేదని.. తదుపరి సమావేశం సీడబ్ల్యూసీ నిర్ణయిస్తుందన్నారు. అనంతరం.. ఈ అంశంపై తెలంగాణ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడారు.

# వెదురు కర్రలే దైవాలుగా.. గద్దెలే గర్భగుడులుగా...

**మేడారం,జనవరి 30 (పిసిడబ్ల్యూ న్యూస్):** వెదురు కర్రలే దైవాలుగా, గద్దెలే గర్భగుడులుగా, పసుపు,కుంకుమలే వజ్రాభరణాలుగా, బెల్లమే నిలువెత్తు బంగారంగా, ఒడిబియ్యమే పరమాన్నంగా, చీర ముక్కరైక బట్టలే సారెలుగా మారి తల్లులకు సమర్పించే అపూర్వ ఆధ్యాత్మిక మహోత్సవం మేడారం సమ్మక్క-సారలమ్మ మహా జాతర భక్తి పారవశ్యంతో అట్టహాసంగా కొనసాగుతోంది. వన దేవత మన దేవత జన దేవత అంటూ అపార విశ్వాసంతో కోట్లాది భక్తుల హృదయాలను ఏకం చేసే ఈ ప్రపంచ ప్రసిద్ధి గాంచిన జాతరకు దేశం నలుమూలలతో పాటు వివిధ రాష్ట్రాల నుంచి లక్షలాది భక్తజనం మేడారానికి తరలివస్తున్నారు. జాతర ప్రాంగణం మొత్తం భక్తులతో కిటకిటలాడుతోంది. ఎటు చూసినా భక్తులే దర్శనమిస్తున్నారు. క్రమబద్ధంగా ఏర్పాటు చేసిన క్యూ లైన్లలో భక్తుల బారులు దర్శనానికి ఎదురుచూస్తుండగా, ప్రశాంత వాతావరణంలో తల్లుల దర్శనాలు సజావుగా కొనసాగుతున్నాయి. భారీ రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం, పోలీస్ శాఖ సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టాయి. ట్రాఫిక్ నియంత్రణ, క్యూ లైన్ నిర్వహణ, భక్తుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించారు. జంపన్న వాగులో పుణ్యస్నానాలతో భక్తుల సందడి నెలకొనగా, గద్దెల వద్ద భక్తులు భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. జాతర ప్రాంగణం అంతటా వైద్య బృందాలు అప్రమత్తంగా సేవలందిస్తుండగా, క్యూ లైన్ల వద్ద వాలంటీర్లు నిరంతరం భక్తులకు సహకారం అందిస్తున్నారు. భక్తుల రద్దీని తట్టుకునేలా అవసరమైన అన్ని ఏర్పాట్లు సమర్థంగా కొనసాగుతున్నాయి. మేడారం మహా జాతరకు వరంగల్ కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి సుమారు 500 మంది ఎన్.ఎస్.ఎస్. వాలంటీర్లు సేవలందిస్తున్నారు. సమ్మక్క?సారలమ్మ గద్దెల వద్ద, క్యూ లైన్లలో భక్తులకు సహాయం చేయడం, జంపన్న వాగు వద్ద సూచనలు ఇవ్వడం, తప్పిపోయిన భక్తులను శిబిరాలకు చేర్చడం వంటి సేవలతో వాలంటీర్లు జాతరలో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు శ్రీ సమ్మక్క-సారలమ్మ తల్లులను దర్శించుకుని మొక్కులు సమర్పించారు. తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ నిలువెత్తు బంగారం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.తెలంగాణ రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి తల్లులను దర్శించుకున్నారు. మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అమ్మవార్లను దర్శించుకున్నారు .మంత్రి సీతక్క, రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, పాయం వెంకటేశ్వర్లు, గండ్ర సత్యనారా యణ అమ్మవార్లను దర్శించి మొక్కులు తీర్చుకున్నారు.బ్రిటిష్ డిప్యూటీ హై కమిషన్ గ్యారత్ వెన్ ఓవెన్ సమ్మక్క-సారలమ్మలకు తులాభారం సమర్పించి తల్లులను దర్శించుకున్నారు .ప్రభుత్వం కల్పించిన సౌకర్యాలపై భక్తులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గత జాతరలతో పోలిస్తే ఈసారి దర్శనాలు మరింత సులభంగా, వేగంగా జరుగుతున్నాయని, భద్రత, పారిశుద్ధ్యం, వైద్య సేవలు మెరుగ్గా ఉన్నాయని భక్తులు ప్రశంసిస్తున్నారు.

# కెసిఆర్‌కు సిట్ షాక్

(మొదటి పేజీ తరువాయి)

సిట్ తిరస్కరించింది. హైదరాబాద్ నందినగర్లోని నివాసంలో అందుబాటులో ఉండాలని కేసీఆర్ కు సూచించింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణకు హాజరుకావాలని జనవరి 29న 160 సీఆర్ పీసీ కింద సిట్ నోటీసులు జారీ చేసింది. కేసీఆర్ ఫామ్ హౌస్ లో ఉండగా..బంజారాహిల్స్ లోని నందినగర్ లో ఆయన నివాసంలో అధికారులు నోటీసులు అందించారు. జనవరి 30న మధ్యాహ్నం 3 గంటలకు విచారణకు హాజరుకావాలని తెలిపారు. అయితే మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో విచారణకు హాజరుకాలేనని సిట్ అధికారులకు కేసీఆర్ లేఖ రాశారు. ఎర్రవల్లిలోని తన ఫామ్ హౌస్ లోనే విచారించాలని అధికారులకు సూచించారు. అలాగే భవిష్యత్ లోనే ఎలాంటి నోటీసులైనా..ఎర్రవల్లిలోని ఫామ్ హౌస్ అడ్రస్ కే పంపాలని విన్నవించారు. అయితే కేసీఆర్ వినతిపై న్యాయనిపుణులతో చర్చించిన సిట్ ఫామ్ హౌస్ లోనే విచారించాలన్న అభ్యర్థనను తిరస్కరించింది. అలాగే ఫిబ్రవరి 1న మధ్యాహ్నం 3గంటలకు బంజారాహిల్స్ నందినగర్లోని కేసీఆర్ నివాసంలో విచారిస్తామని నోటీసు జారీ చేసింది. శుక్రవారం మున్సిపల్ ఎన్నికల కారణంగా విచారణను వాయిదా వేయాలని కోరారు. మరో రోజు విచారణకు పిలిస్తే తప్పకుండా హాజరవుతానని, విచారణ కోసం వేరే తేదీ నిర్ణయించాలని సిట్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. కేసీఆర్‌ను ఎక్కడ విచారించాలనే దానిపై సిట్ అధికారులు ఈ రోజు సమావేశం నిర్వహించి, న్యాయ నిపుణులతో చర్చించారు. ఈ నేపథ్యంలోనే కేసీఆర్‌ను ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కాకుండా హైదరాబాద్‌లోనే విచారించాలని నిర్ణయించారు.

# తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్యాల సాధనకు కృషి

(మొదటి పేజీ తరువాయి)

అదే విధంగా భవిష్యత్ లో యూరియా, ఎరువుల పంపిణీని ఐటి ఆధారిత సేవల ద్వారా పటిష్టంగా పంపిణీ చేయాలని అధికారులను ఆదేశించారు. వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, హార్టికల్చర్ శాఖలలో అమలవుతున్న పథకాలపై సమీక్షించారు. ఆయిల్ పామ్ ఎ÷-లాంటేషన్, ప్రజల అవసరాల మేరకు పండ్లు, కూరగాయల పెంపకం విస్తృతంగా ప్రోత్సహించాలని సి.ఎస్ అధికారులకు సూచించారు. ప్రభుత్వం హైబ్రిడ్ మోడ్ లో భాగంగా చేపట్టిన రంగారెడ్డి జిల్లా కోహెడ మార్కెట్ నిర్మాణ పనులపై సమీక్ష చేశారు. అదే విధంగా రాష్ట్రంలో రైతుల సంక్షేమం, పంటల దిగుబడి, రైతు సమస్యల పట్ల వ్యవసాయ శాఖ నిరంతర మానిటరింగ్ చేయాలని డిజిటల్ క్రాప్ సర్వే కూడా నిర్వహించాలని సూచించారు.÷ూష్ట్రంలో వ్యవసాయ రంగం ప్రస్తుత స్థితిగతులు, రైతులకు అందుతున్న సేవలు, సాగునీటి లభ్యత, విత్తనాలు?ఎరువుల సరఫరా, పంటల దిగుబడి, అలాగే సహకార శాఖ ద్వారా అమలవుతున్న వివిధ పథకాల పురోగతిపై సమగ్రంగా చర్చించారు. రాబోయే సాగు కాలానికి అవసరమైన విత్తనాలు, ఎరువులు తగినంతగా అందుబాటులో ఉండేలా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను సి.ఎస్ ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జిల్లా స్థాయిలో పర్యవేక్షణను మరింత బలోపేతం చేయాలని సూచించారు. సహకార సంఘాల పనితీరు, రైతు సహకార సంఘాల ఆర్థిక స్థితి, రుణాల పంపిణీ పై సమీక్ష చేశారు. సహకార సంఘాలను మరింత పటిష్టం చేసి రైతులకు మెరుగైన సేవలు అందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. పారదర్శకతతో కూడిన వ్యవస్థను అమలు చేయాలని, రైతుల విశ్వాసాన్ని పెంపొందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలవుతున్నాయా లేదా అన్నదానిపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని, సమస్యలు ఎదురైన చోట వెంటనే పరిష్కరించాలని సి.ఎస్ స్పష్టం చేశారు.పశు సంవర్ధక, డెయిరీ అభివృద్ధి, మత్స్యశాఖ : అనంతరం పశుసంవర్ధక, డెయిరీ అభివృద్ధి, మత్స్యశాఖలపై సి.ఎస్ సమీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పశు సంవర్ధక రంగం అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలు, డెయిరీ రంగంలో ఉత్పత్తి పెంపు, రైతులకు మెరుగైన ఆదాయం కల్పించడంపై చేపట్టిన కార్యక్రమాలు, మత్స్యశాఖ ద్వారా మత్స్యకారుల సంక్షేమానికి అమలు చేస్తున్న పథకాల పురోగతిని ప్రధాన కార్యదర్శి సమీక్షించారు.శువైద్య సేవలను గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేయాలని, పశు ఆరోగ్య శిబిరాల నిర్వహణను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు.

పశువుల వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని, టీకాల కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. డెయిరీ అభివృద్ధి అంశంలో పాల సేకరణ, శీతలీకరణ కేంద్రాల సామర్థ్యాన్ని పెంచాలని, చిన్న, సన్నకారు పాడి రైతులకు లాభదాయకంగా ఉండే విధంగా విధానాలు రూపొందించాలని పేర్కొన్నారు. సహకార డెయిరీ సంస్థల పనితీరును మెరుగుపరచడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. మత్స్యశాఖ సమీక్షలో, చేపల ఉత్పత్తి పెంపు, చెరువులు, కుంటలు, మల్లన్న సాగర్, కొండపోచమ్మ, మిడ్ మానేరు, పాలేరు తదితర జలాశయాల్లో చేపల పెంపకం పై కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. మత్స్యకారులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, మత్స్యకారుల సంక్షేమ పథకాలు సమయానికి లబ్ధిదారులకు చేరేలా చూడాలని అధికారులను ఆదేశించారు. అన్ని శాఖల మధ్య సమన్వయం ఉండేలా పనిచేయాలని, ప్రభుత్వ లక్ష్యాలను క్షేత్రస్థాయిలో అమలు చేయడంలో అలసత్వం వహించకూడదని సి.ఎస్ స్పష్టం చేశారు.

# మహాత్మాగాంధీ 78వ వర్ధంతి

(మొదటి పేజీ తరువాయి)

నిలుస్తాయి. కార్యక్రమంలో గాంధీకి ప్రత్యేక పుష్పాంజలి, ప్రతిమలకు పూల మాలలు, స్మరణీయ ప్రసంగాలు మరియు సంగీత కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. భక్తులు, స్థానికులు, పర్యాటకులు కూడా భాగస్వామ్యమై, గాంధీ జీవితం, సూత్రాలు గురించి అవగాహన పెంపొందించుకున్నారు. మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన ఎక్స్‌లో ట్వీట్ చేసారు.జాతిపిత మహాత్మా గాంధీ 78వ వర్ధంతి సందర్భంగా ఆ మహనీయుడికి ఘన నివాళి అర్పిస్తున్నాను. అహింసా విధానంతో కోట్ల మంది దేశప్రజలను ఒక్కతాటిపై నడిపి స్వాతంత్ర్యం సాధించారు. గాంధీజీ బోధనలైన సత్యం, అహింస, శాంతి, సేవ అనే సిద్ధాంతాలను ప్రతి ఒక్కరూ నిత్యం పాటించాలి. వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జాతిపిత మహాత్మా గాంధీకి నివాళులర్పించారు. 'సత్యం తాత్కాలికంగా ఓడినట్టుగా కనిపించవచ్చు.. కానీ ఎప్పటికీ ఓడదు' అని చెప్పడమే కాక.. తన చివరి శ్వాస వరకు సత్యానికే అంకితమైన జీవితాన్ని గడిపిన మహనీయుడు మహాత్మా గాంధీ. నేడు జాతిపిత వర్ధంతి సందర్భంగా ఆయనకు మనస్ఫూర్తిగా నివాళులు' అని వైఎస్ జగన్ ట్వీట్ ద్వారా పేర్కొన్నారు. ఈ ట్వీట్ ద్వారా గాంధీజీ జీవితాన్ని, ఆయన బోధనలను జగన్ గుర్తుచేసుకున్నారు.

# మహారాష్ట్ర డిప్యూటీ సీఎంగా సునేత్ర పవార్..

(మొదటి పేజీ తరువాయి)

నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. భర్త మరణంతో కుంగిపోయిన ఆమె.. ఎన్సీపీ సీనియర్ నేతల ప్రతిపాదనను అంగీకరిస్తూ బాధ్యతలు స్వీకరించేందుకు ముందుకొచ్చారు. మహారాష్ట్ర తొలి మహిళా ఉప ముఖ్యమంత్రిగా సునేత్ర గుర్తింపు సాధించనున్నారు.బారమతి విమాన ప్రమాదంలో అజిత్ పవార్ దుర్మరణంతో తదుపరి డిప్యూటీ సీఎం ఎవరు? నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (NCPని నడిపించేది ఎవరు? అనే ప్రశ్నలు ఉత్పన్నమయ్యాన్నాయి. నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ నేతలు కొందరు పవార్ స్థానాన్ని ఆశించారు కూడా. అయితే.. కొందరు సీనియర్ నాయకులు మాత్రం అజిత్ పవార్ భార్య సునేత్ర పవార్ పేరును ప్రతిపాదించారు. రాజకీయ దురంధరుడైన అజిత్ దాదా వారసత్వాన్ని కొనసాగించేందుకు సునేత్రనే సరైన వ్యక్తి అని వారందరూ తీర్మానించారు.

# జలశక్తి కమిటీ ముందు ముగిసిన భేటీ

(మొదటి పేజీ తరువాయి)

ప్రతిపాదించింది.. పోలవరం, నల్లమలసాగర్ ప్రాజెక్టును అజెండాలో పెట్టవద్దని కోరింది. ట్రైబ్యునల్ తీర్పు వచ్చే వరకు 50 శాతం వాడుకునే అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేసింది. తెలంగాణ అధికారులు లేవనెత్తిన పలు అంశాలపై ఏపీ ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేసింది. వారంలోగా అజెండా అంశాలు ఖరారు చేసి లిఖితపూర్వకంగా ఇవ్వాలని సీడబ్ల్యూసీ ఛైర్మన్ తెలిపారు. అజెండా అంశాలు ఖరారయ్యాక భేటీ తేదీని ఖరారు చేస్తామని ఛైర్మన్ స్పష్టం చేశారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య నదీ జలాల నిర్వహణ, వినియోగం విషయంలో కొనసాగుతున్న వివాదాల పరిష్కారానికి కేంద్ర జలశక్తి శాఖ ఏర్పాటు చేసిన కమిటీ తొలి సమావేశం శుక్రవారం ఢిల్లీలో ప్రారంభమైంది. సీడబ్ల్యూసీ ఛైర్మన్ అనుపమ్ ప్రసాద్ అధ్యక్షతన జరుగుతోంది. కమిటీ తదుపరి చర్చల కోసం జల వివాదాలకు సంబంధించిన అజెండా అందజేయాలని కమిటీ సభ్యులను సీడబ్ల్యూసీ ఛైర్మన్ కోరారు. ఈ సమావేశానికి ఏపీ, తెలంగాణ జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, జలవనరుల శాఖ సలహాదారులు, ఇంజనీర్ ఇన్- చీఫ్‌లు, జలవనరుల శాఖ అధికా రులు, కేఆర్ఎమ్‌బీ, జీఆర్ఎమ్‌బీ ఛైర్మన్లు, ఎన్‌డబ్ల్యూడీఏ చీఫ్ ఇంజనీర్ హాజరయ్యారు. ఏపీ నుంచి జలవనరుల శాఖ అడ్వైజర్- వెంకటేశ్వరరావు, ఈఎన్సీ నరసింహమూర్తి పలువురు అధికారులు హాజరయ్యారు. అలాగే తెలంగాణ నుంచి ఆదిత్యనాథ్, ఇరిగేషన్ శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జ, ఇంజనీరింగ్ ఇన్ చీఫ్ అంజద్ హుస్సేన్, కేంద్ర రాష్ట్ర సమన్వయ అధికారి గౌరవ్ ఉప్పల్ హాజరయ్యారు.

# హార్వర్డ్ వర్సిటీలో సిఎం రేవంత్ శిక్షణ

(మొదటి పేజీ తరువాయి)

కూడిన ఇంటెన్సివ్ ప్రోగ్రామ్‌లో భాగంగా అధికారం, నాయకత్వం, సంఘర్షణలు, అనిశ్చితి వంటి అంశాలపై శిక్షణ పొందారు. ప్రోగ్రామ్ ముగిసిన సందర్భంగా హార్వర్డ్ అధ్యాపకులు రేవంత్ రెడ్డితో పాటు మిగిలిన 62 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. అయితే భారతదేశ చరిత్రలో అధికారంలో ఉండగానే హార్వర్డ్ నుంచి ఈ రకమైన సర్టిఫికెట్ పొందిన తొలి ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి రికార్డ్ సృష్టించారు.

# నాంపల్లి ఫర్నీచర్ షాప్ అగ్నిప్రమాదం

- కంటతడి పెట్టిస్తున్న మృతుడి ఫోన్ కాల్ ఆడియో
- రక్షించాలంటూ వేడుకున్న ఇంతియాజ్



**హైదరాబాద్,జనవరి 30 (పిసిడబ్ల్యూ న్యూస్):** నాంపల్లి ఫర్నీచర్ షాపులో జరిగిన అగ్ని ప్రమాద ఘటనలో ఐదుగురు ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఈ నెల 24న షాపులోని సెల్లార్‌లో చెలరేగిన మంటల్లో చిక్కుకుని ఐదుగురు మరణించారు. ఈ హృదయ విదారక ఘటనకు సంబంధించి ఒక బాధితుడి కాల్ రికార్డింగ్ ఆడియో లీకైంది. మృతుల్లో ఒకరైన ఇంతియాజ్ అనే యువకుడు.. అగ్ని ప్రమాదం సంభవించిన తర్వాత తన స్నేహితుడికి ఫోన్ చేసి, రక్షించమని వేడుకున్నాడు. తాను మంటల్లో లోపల చిక్కుకున్నట్లు, బయటకు రావడానికి ఏమీ కనిపించడం లేదని స్నేహితుడికి చెప్పాడు. అందులోంచి బయటకు రావడానికి అన్ని దారులు మూసుకుపోయాయని ఫోన్లో చెప్పాడు. తనతోపాటు పిల్లలు కూడా ఉన్నట్లు తెలిపాడు. ప్రస్తుతం ఇంతియాజ్‌కు సంబంధించిన ఈ ఆడియో వైరల్ అవుతోంది. ప్రాణాలు కోల్పోవడానికి కొద్ది సేపటి ముందు కాల్‌లో అతడి ఆవేదన అందరినీ కలిచివేస్తోంది. చివరి క్షణాల్లో బాధితుల వేదన కూడా రికార్డయ్యింది. ఘటనకు సంబంధించి.. సెల్లార్‌లోని ఫర్నీచర్ షాపులో మంటలు చెలరేగి, భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. దీంతో లోపల ఉన్న ఐదుగురు అందులో చిక్కుకుపోయారు. చుట్టూ పొగ, మంటల ధాటికి బయటికి రాలేకపోయారు. బయటికొచ్చే ఏ మార్గం లేకపోవడంతో అందులోనే ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. అగ్ని ప్రమాదం జరిగినప్పుడు అందరూ బయటికొచ్చేశారు. లోపల గార్డు యాదయ్య కుమారులు ప్రణీత్, అఖిల్ ఉండిపోయారు. వారిని కాపాడేందుకు ఉస్మాన్ ఖాన్, ఆయన భార్య బేబి, ఇంతియాజ్ వెళ్లారు. చివరకు ఈ ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు.

# స్మార్ట్ కిడ్జ్‌లో అంబరాన్నంటిన క్రీడా సంబురం

● స్మార్ట్ కిడ్జ్ స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభించిన జిల్లా క్రీడా అధికారి సునీల్ రెడ్డి





**ఖమ్మం ప్రతినిధి జనవరి 30 (పిసిడబ్ల్యూ న్యూస్):** స్థానిక స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో శుక్రవారం క్రీడా సంబురాలు అంబరాన్నంటాయి. పాఠశాల చైర్మన్ చింతనిప్పు కృష్ణ చైతన్య పర్యవేక్షణలో నిర్వహించిన స్పోర్ట్స్ మీట్ విద్యార్థుల క్రీడా నైపుణ్యాలకు నిదర్శనంగా నిలిచాయి. తొలుత ముఖ్య అతిథి జిల్లా క్రీడాభివృద్ధి అధికారి తుంబూరు సునీల్ రెడ్డి క్రీడాజ్యోతిని వెలిగించి పోటీలను ప్రారంభిం చారు. డి ఎస్ డి ఓ సునీల్ రెడ్డి మాట్లాడుతూ.. క్రీడా స్ఫూర్తితో అన్ని రంగాలలో ఉన్నత స్థాయిలో రాణించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. చదువుతోపాటు క్రీడల్లోనూ ప్రోత్సహించడానికి పాఠశాల యాజమాన్యం నిర్వహిస్తున్న స్పోర్ట్స్ మీట్ పట్ల అభినందనలు తెలిపారు. గెలుపోటములను స్ఫూర్తిగా తీసుకొని క్రీడల్లో రాణించాలని కోరారు. స్మార్ట్ కిడ్జ్ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి, జిల్లాస్థాయి క్రీడా పోటీలలో పతకాలు సాధించడం హర్షనీయమన్నారు. పాఠశాల చైర్మన్ చింతనిప్పు కృష్ణ చైతన్య మాట్లాడుతూ.. విద్యార్థుల క్రీడా ప్రతిభను వెలికి తీయడానికి ప్రతి సంవత్సరం లాగానే ఈసారి కూడా వార్షిక స్పోర్ట్స్ మీట్ ను నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోటీలలో పాఠశాలలోని అన్ని తరగతుల విద్యార్థులు దాదాపు 270 మంది వివిధ పోటీలలో తమ సత్తా చూపుతున్నారని పేర్కొన్నారు. చదువుతోపాటు అన్ని రంగాలలో తమ పాఠశాల విద్యార్థులను ఉన్నతంగా రాణించేలా తీర్చిదిద్దుతు న్నామని తెలియజేశారు. అనంతరం విద్యార్థులకు వివిధ క్రీడలలో నిర్వహించిన పోటీలలో విద్యార్థులు పోటాపోటీగా పాల్గొన్నారు. ఈ స్పోర్ట్స్ మీట్ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# భారత జెర్సీ లక్ష్యంగా క్రమశిక్షణతో సాధన చేయాలి

● గాయాల్లేని క్రీడా ప్రయాణమే నిజమైన విజయం : డా. ఎమ్.జీ.వి. ప్రవీణ్ కుమార్





**ఖమ్మం ప్రతినిధి, జనవరి 30 (పిసిడబ్ల్యూ న్యూస్):** భారత మహిళా క్రికెట్ జట్టులో స్థానం సాధించాలన్న లక్ష్యంతో ప్రతి క్రీడాకారిణి క్రమశిక్షణ, అంకితభావంతో సాధన కొనసాగించాలని ప్రముఖ ఈఎన్‌టీ వైద్యులు డా. ఎమ్.జీ.వి. ప్రవీణ్ కుమార్ అన్నారు. ఖమ్మం జిల్లా కేంద్రంలోని ఎస్.ఆర్ & బి.జి.ఎన్.ఆర్ ప్రభుత్వ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న ఇందిరాగాంధీ 5వ జాతీయ స్థాయి సీనియర్ మహిళా టీ20 క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ జాతీయ స్థాయి పోటీల్లో ఉత్తరప్రదేశ్, విధర్భతో పాటు పలు రాష్ట్రాలకు చెందిన మహిళా క్రికెట్ జట్లు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శిస్తున్నాయి. ప్రారంభ కార్యక్రమంలో క్రీడాకారిణులను ఉద్దేశించి డా. ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, స్పష్టమైన లక్ష్యంతో కఠిన సాధన చేస్తే భారత జట్టులో స్థానం సాధించడం అసాధ్యం కాదని అన్నారు. క్రీడల్లో విజయం ఎంత ముఖ్యమో ఆరోగ్యం అంతకంటే ముఖ్యమని పేర్కొంటూ, గాయాల బారిన పడకుండా శాస్త్రీయ శిక్షణతో ఆటను కొనసాగించాలని సూచించారు. మ్యాచ్ ప్రారంభానికి ముందు క్రీడాకారిణులను పరిచయం చేసుకుని వారిని ఉత్సాహపరుస్తూ పలు విలువైన సూచనలు చేశారు. అనంతరం డా. ప్రవీణ్ కుమార్ స్వయంగా బ్యాట్ పట్టి బ్యాటింగ్ చేయడం ద్వారా క్రీడాకారిణుల్లో క్రీడాస్ఫూర్తిని నింపారు. జాతీయ స్థాయి మహిళా క్రికెట్ టోర్నమెంట్‌ను సక్రమంగా నిర్వహిస్తున్న ఖమ్మం క్రికెట్ అసోసియేషన్ కన్వీనర్ మహమ్మద్ మతిన్ కృషిని ఈ సందర్భంగా ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో వివిధ రాష్ట్రాల మహిళా క్రికెట్ జట్ల సభ్యులు, క్రీడా నిర్వాహకులు, అధికారులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.

# సబ్ జైలు, పరకాలను సందర్శించిన డీజీ ప్రిజన్స్ డా. సౌమ్య మిశ్రా







**పరకాల, జనవరి 30 (పిసిడబ్ల్యూ న్యూస్):** డీజీ ప్రిజన్స్ & కారెక్షనల్ సర్వీసెస్ డా. సౌమ్య మిశ్రా ఐపీఎస్ శుక్రవారం సబ్ జైలు, పరకాలను సందర్శించారు. ఈ సందర్భంగా జైలు ప్రాంగణాన్ని సమగ్రంగా పరిశీలించి, ఖైదీలకు అందుతున్న వసతులు, సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఖైదీలతో ప్రత్యక్షంగా మాట్లాడిన ఆమె, వారి సంక్షేమం, జీవన పరిస్థితులు, పునరావాస చర్యలపై వివరాలు తెలుసుకున్నారు. ఖైదీలను మానవీయ దృష్టితో చూడాలని, సంస్కరణాత్మక విధానాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని సూచించారు. కారాగారాలు కేవలం శిక్షాస్థానాలు కాకుండా సంస్కరణ కేంద్రాలుగా మారాలని ఆమె పేర్కొన్నారు. అనంతరం సబ్ జైలు, పరకాలలో పదవీ విరమణ ఫెలిసిటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల 31న సూపర్‌అన్యుయేషన్ వయస్సు పూర్తి చేసుకుని పదవీ విరమణ చేయనున్న అసిస్టెంట్ డిప్యూటీ జైలర్ శ్రీమతి గడ్డం దైనమ్మ సేవలను డీజీ ఘనంగా స్మరించారు. ఈ సందర్భంగా డా. సౌమ్య మిశ్రా మాట్లాడుతూ, శ్రీమతి గడ్డం దైనమ్మ నిష్కలంకమైన సేవలు, శాఖ పట్ల చూపిన నిజాయితీ, అంకితభావం అభినందనీయమని పేర్కొన్నారు. సేవలకు గుర్తింపుగా ఉద్యోగుల నెలవారీ విరాళాలతో కూడిన వెల్ఫేర్ ఫండ్ నుంచి చెక్కును ఆమెకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ రేంజ్ డీఐజీ ఆఫ్ ప్రిజన్స్ ఎం. సంపత్, వరంగల్ డీఎస్‌జేఓ పి. వెంకటేశ్వర స్వామి, సబ్ జైలు సూపరింటెండెంట్ ఎన్. ప్రభాకర్, ఇతర కారాగార శాఖ అధికారులు, సిబ్బంది, పదవీ విరమణ పొందుతున్న ఉద్యోగి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. దీనికి స్పందించిన శ్రీమతి గడ్డం దైనమ్మ, తనకు అందించిన గౌరవం, ఆదరణకు శాఖాధికారులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం ఇతర సిబ్బందికి వృత్తి నైపుణ్యం, నైతిక విలువలు, అంకితభావంతో విధులు నిర్వహించేందుకు ప్రేరణగా నిలిచిందని అధికారులు తెలిపారు.

# మహిళా క్రీడాకారులకు అండగా చక్రధర్ ఫౌండేషన్

ఐదవ ఇందిరాగాంధీ మహిళల ఛాంపియన్షిప్‌లో నాణ్యమైన భోజనం, వసతి కల్పన క్రీడాకారుల హర్షం

ఎంపీ రఘు రాం రెడ్డికి బ్రోచర్ ద్వారా సేవా కార్యక్రమాల వివరాలు అందజేత



**ఖమ్మం, జనవరి 30 (పిసిడబ్ల్యూ న్యూస్):** మహిళా క్రీడాకారుల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న చక్రధర్ ఫౌండేషన్ మరోసారి తన సామాజిక బాధ్యతను చాటుకుంది. ఐదవ ఇందిరాగాంధీ మహిళల ఛాంపియన్షిప్‌లో పాల్గొన్న క్రీడాకారులకు నాణ్యమైన భోజనం, సౌకర్యవంతమైన వసతి ఏర్పాటు చేసి వారి ప్రశంసలు అందుకుంది. ఎక్స్క్లూస్ రోబోటిక్ ఇంటెలిజెన్స్, డ్రోన్ టెక్నాలజీ, స్ట్రీమ్ ఆటోమేషన్ సంస్థల అధినేత చక్రధర్ ప్రత్యేక చొరవతో ఈ సేవలు అందించగా, రాజస్థాన్ మార్బుల్ అధినేతలు గుజ్జర్, భావర్జీ సహకారం అందించారు. పోటీ వాతావరణంలో శారీరక ఆరోగ్యం ఎంతో కీలకమని, ఇలాంటి సదుపాయాలు తమ ప్రదర్శనపై సానుకూల ప్రభావం చూపాయని మహిళా క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చక్రధర్ ఫౌండేషన్ నిర్వహిస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలు, క్రీడా ప్రోత్సాహక చర్యల వివరాలను ఎంపీ రఘు రాం రెడ్డికి బ్రోచర్ రూపంలో అందజేశారు. మహిళా క్రీడల అభివృద్ధికి స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యం ఎంతో అవసరమని నిర్వాహకులు తెలిపారు.

## పరకాల పట్టణం 9 వార్డ్ కౌన్సిలర్‌గా బత్తుల మల్లేశం నామినేషన్..



**పరకాల, జనవరి 30 (పిసిడబ్ల్యూ న్యూస్):** పరకాల పట్టణ మున్సిపాలిటీలో మొత్తం 22 వార్డులు ఉండగా, ఇందులో భాగంగా 9వ వార్డులో పద్మశాలి కులానికి చెందిన పరకాల స్థానికుడు బత్తుల మల్లేశం ఈరోజు మున్సిపల్ కౌన్సిలర్‌గా తన నామినేషన్ దాఖలు చేశారు. గతంలో ఎన్నో సేవా కార్యక్రమాలతో ప్రజల్లో మంచి గుర్తింపు పొందిన మల్లేశం, నిరంతరం ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ ముందుకు సాగుతున్నారు. ముఖ్యంగా 2005 సంవత్సరంలో అప్పటి ఎమ్మెల్యే కొండా సురేఖ హయాంలో మాదారం శివారులోని గుమస్త సంఘాలకు సంబంధించిన భూ సమస్యపై కీలకంగా పోరాటం చేశారు. అప్పటి కలెక్టర్ కారుకు అడ్డంగా పడుకొని నిరసన వ్యక్తం చేస్తూ, 9వ వార్డు కాలనీవాసులకు దాదాపు 121 ఫ్లాట్లు, సుమారు 120 గజాల స్థలాన్ని ఇప్పించడంలో ప్రధాన పాత్ర పోషించారు. ఈ ఉద్యమం ద్వారా అనేక పేద కుటుంబాలకు సొంతింటి కలను నిజం చేశారు. అప్పటి నుంచీ నేటి వరకు పరకాల పట్టణ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, సేవ చేయడమే తన లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు మల్లేశం తెలిపారు. 9వ వార్డులో దాదాపు 90 శాతం మంది తన రక్త బంధువులేనని, వారిని ఎప్పటికీ మరచిపోనని పేర్కొన్నారు. తనను గెలిపించి పద్మశాలీల సత్తాను చాటాలని ఈ సందర్భంగా కోరారు. అంతేకాకుండా 9వ వార్డులోని అన్ని కులాలు, వర్గాల ప్రజలను సమానంగా దగ్గర తీసుకొని, ప్రతి సమస్యలోనూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు. వార్డు అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని, ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయనని బత్తుల మల్లేశం స్పష్టం చేశారు.

## పరకాల మున్సిపల్ 11వ వార్డు నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా మార్త విక్రమ్ నామినేషన్



**పరకాల, జనవరి 30 (పిసిడబ్ల్యూ న్యూస్):** పరకాల పట్టణ మున్సిపాలిటీ 11వ వార్డు నుంచి భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీ అభ్యర్థిగా మార్త విక్రమ్ శుక్రవారం రోజున అధికారికంగా నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజల ఆశీర్వాదాలతో కారు గుర్తుకు ఓటు వేసి గెలిపిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. వార్డులో ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉంటూ, మౌలిక వసతుల అభివృద్ధి, శుభ్రత, తాగునీరు, రోడ్లు, కాలనీల సమస్యల పరిష్కారానికి పూర్తి స్థాయిలో కృషి చేస్తానని తెలిపారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, వార్డు సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొని మద్దతు తెలిపారు.

## ఫైనల్‌కు చేరిన ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్ జట్లు





**ఖమ్మం ప్రతినిధి జనవరి 30 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఉత్తరప్రదేశ్‌విదర్భ, ఉత్తరాఖండ్‌ఢిల్లీ మధ్య జరిగిన సెమీఫైనల్ పోరులో ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్ జట్లు ఫైనల్‌కు అర్హత సాధించాయి. మొదటి సెమీఫైనల్‌లో ఉత్తరప్రదేశ్, విదర్భ జట్లు తలపడ్డాయి. ముందుగా బ్యాటింగ్ చేసిన ఉత్తరప్రదేశ్ 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 142 పరుగులు చేసింది. తను సింగ్ 53 బంతుల్లో 63 పరుగులు చేయగా, ఖుషి పాల్ 45 పరుగులతో జట్టుకు కీలక సహకారం అందించింది. విదర్భ బౌలర్లలో స్వర తాక్రె, కల్యాణి కుట్టి, గ్రీష్మ తలా తలో వికెట్ చొప్పున తీశారు. లక్ష్య ఛేదనలో విదర్భ 5 వికెట్లు కోల్పోయి 128 పరుగులకే పరిమితమైంది. ప్రాచి 33 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచింది. ఉత్తరప్రదేశ్ బౌలర్ల కట్టుదిట్టమైన ప్రదర్శనతో విదర్భపై 14 పరుగుల తేడాతో ఉత్తరప్రదేశ్ విజయం సాధించింది. రెండో సెమీఫైనల్‌లో ఉత్తరాఖండ్, ఢిల్లీ జట్లు తలపడ్డాయి. ఉత్తరాఖండ్ బ్యాటర్ సాక్షి వాగ్ మోడే అద్భుత ప్రదర్శనతో 56 బంతుల్లో 106 పరుగులు చేసింది. ఇందులో 13 ఫోర్లు, ఒక సిక్సర్ ఉన్నాయి. రేఖ 21 పరుగులతో సహకరించింది. ఢిల్లీ బౌలర్లలో మహిమ శుక్లా 2 వికెట్లు తీసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన ఢిల్లీ 8 వికెట్లు కోల్పోయి కేవలం 113 పరుగులకే పరిమితమైంది. ఉత్తరాఖండ్ బౌలర్లలో పూనమ్ 4 వికెట్లు, ఖుషి 2 వికెట్లు తీసి ఢిల్లీ పతనానికి కారణమయ్యారు. ఫలితంగా ఉత్తరాఖండ్ 93 పరుగుల భారీ తేడాతో విజయం సాధించి ఫైనల్‌కు చేరింది.

## మీరు హామీ ఇవ్వండి.. నెరవేర్చే బాధ్యత నాది..!

● ఏదులాపురం మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల సమావేశంలో మంత్రి పొంగులేటి



**పాలేరు, జనవరి 30 (పిసిడబ్ల్యూ న్యూస్) :** "వార్డుల్లోకి వెళ్ళండి.. జనం సమస్యలను గుండెలకు హత్తుకోండి.. పరిష్కరిస్తామని గట్టిగా హామీ ఇవ్వండి.. వాటిని నెరవేర్చే బాధ్యత తనది" అంటూ తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఏదులాపురం అభ్యర్థులకు స్పష్టం చేశారు. ఖమ్మంలోని తన క్యాంపు కార్యాలయంలో 32 వార్డుల అభ్యర్థులు, ఇన్-చార్జులతో శుక్రవారం రాత్రి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డుల వారీగా సమావేశం నిర్వహించిన మంత్రి మాట్లాడుతూ... మున్సిపల్ చైర్మన్ పీఠాన్ని కాంగ్రెస్ కైవసం చేసుకుంటే, ఏదులాపురం రూపురేఖలను మారుస్తానని మంత్రి చెప్పారు. అభివృద్ధిలో ఏదులాపురాన్ని రాష్ట్రానికే ఒక దిక్సూచిగా, ఆదర్శ మున్సిపాలిటీగా నిలబెట్టే బాధ్యత తనదేనని భరోసా ఇచ్చారు. నియోజకవర్గ అభివృద్ధిలో ఏదులాపురాన్ని అగ్రస్థానంలో నిలిపేందుకు తన వంతు కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు. ప్రచారంలో భాగంగా ప్రతి వార్డులోనూ తాను స్వయంగా పర్యటించి ప్రచారం నిర్వహిస్తానని వెల్లడించారు. ప్రత్యర్థుల ఎత్తుగడలను చిత్తు చేస్తూ, దూకుడుగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. వార్డు, జోనల్ ఇన్-చార్జులు, అభ్యర్థులు సమన్వయంతో ప్రతి ఓటరును కలిసి కాంగ్రెస్ వైపు తిప్పుకోవాలని మంత్రి సూచించారు. ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ ఫలాలను వివరిస్తూనే, అభివృద్ధి పట్ల వారికున్న నిబద్ధతను చాటిచెప్పాలన్నారు. ఏదులాపురం మున్సిపాలిటీని కాంగ్రెస్ కైవసం చేసుకోవడమే ఏకైక లక్ష్యంగా ప్రతి కార్యకర్త ఒక సైనికుడిలా పనిచేయాలని మంత్రి పొంగులేటి దిశానిర్దేశం చేశారు.

## వాసవి క్లబ్ ఆఫ్ ఇంటర్నేషనల్ వారి ఆధ్వర్యంలో పండ్లు పంపిణీ




**గంగాధర జనవరి 30(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలో ఈరోజు వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ వారి క్యాలెండర్ ఆఫ్ ద ఇయర్ ప్రోగ్రాం లో భాగంగా నిర్వహించిన మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా ఈరోజు గంగాధరలో నివాళులర్పించాము మరియు స్వీట్స్ అండ్ పండ్లు పంపిణీ చేశాముక్లబ్ అధ్యక్షులు పడకంటి శ్రీనివాస్ సెక్రటరీ తమ్మిశెట్టి శ్రీనివాస్ ట్రెజరర్ ఇరుకుల్లా నాగార్జున సేవాదళ్ అధ్యక్షులు రేగురి కరుణాకర్ గౌరవ అధ్యక్షులు నలుమాచు హరికిషన్ మరియు మండల ఆర్యవైశ్య సోదరులు పాల్గొని విజయవంతం చేసినారు.

## పోతుగంటిపల్లి గ్రామంలో ఇంట్లో ఉరి వేసుకుని వ్యక్తి మృతి



**గంగాధర జనవరి 30(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలం పోతుగంటిపల్లి గ్రామానికి చెందిన కదారి మల్ల రెడ్డి వయసు 85 సంవత్సరాలు. ప్రస్తుతం అతని చిన్న కొడుకు ఇంటి ఆవరణలో ఒక రూములో ఉంటున్నారు. గత 2 సంవత్సరాల కిందట అతని భార్య అనారోగ్యంతో మరణించినదని, దానితో అతడు ఒక్కడే మానసికంగా వేదన పడుతూ ఒంటరితనంతో కుమిలిపోయేవాడు. ఈరోజు ఉదయం తన రూములో దూలంకి ధోతితో ఉరి పెట్టుకొని మరణించి ఉన్నాడు. ఒంటరితనం భరించలేకనే తన తండ్రి ఉరి పెట్టుకొని మరణించినాడు అని అతని కొడుకు శ్రీనివాస్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు గంగాధర ఎస్సై బీ వంశీకృష్ణ తెలిపారు.

## రేపటి నుంచే పొంగులేటి ప్రచార హోరు

**- ఏదులాపురం మున్సిపాలిటీలో మంత్రి పర్యటన ఖరారు**
**- వార్డుల వారీగా ప్రచార షెడ్యూల్ విడుదల**



**పాలేరు, జనవరి 30 (పిసిడబ్ల్యూ న్యూస్) :** తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి రేపటి (శనివారం) నుంచి ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో విస్తృతంగా పర్యటించనున్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన వార్డుల వారీగా పర్యటిస్తూ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేయనున్నారు. ఈ మేరకు మంత్రి క్యాంపు కార్యాలయ ఇన్ చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి పర్యటనకు సంబంధించిన వివరాలను శుక్రవారం రాత్రి ఓ ప్రకటనలో వెల్లడించారు. ఉదయం 07:30 గంటలకు 6వ వార్డులో పర్యటన ప్రారంభం కానుంది. అనంతరం 08:00 గంటలకు 5వ వార్డులో,08:30 గంటలకు 4వ వార్డులో ఆయన పర్యటిస్తారు. ఉదయం 09:00 గంటలకు 3వ వార్డు, 25వ వార్డుల్లో మంత్రి ప్రచారం నిర్వహించనున్నారు. కావున ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, వార్డు ఇన్ చార్జ్ లు, జోనల్ ఇన్ చార్జ్ లు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరు కావాలని దయాకర్ రెడ్డి కోరారు. మంత్రి పర్యటన నేపథ్యంలో ఆయా వార్డుల్లో స్థానిక నాయకులు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

### వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ వారి ఆధ్వర్యంలో

## గాంధీజీ వర్ధంతి వేడుకలు






**గంగాధర జనవరి 30(పీసీడబ్ల్యూ న్యూస్):**కరీంనగర్ జిల్లా కరీంనగర్ లో ఈరోజు వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ వారి సూచన మేరకు క్యాలెండర్ ఈవెంట్ లో భాగంగా వాసవి క్లబ్ వీ= కరీంనగర్ ఆధ్వర్యంలో 30-01-2026, శుక్రవారం రోజున ఉదయం 8:30 నిమిషములకు మన జాతిపిత మహాత్మ గాంధీజీ వర్ధంతి సందర్భంగా కరీంనగర్ కోతి రాంపూర్ లోని గాంధీ విగ్రహం వద్ద మహాత్మా గాంధీ కి పూలమాల వేసి ఘనంగానివాళులు అర్పించడం జరిగింది మరియు క్లబ్ సభ్యులందరూ స్వచ్ఛభారత్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ×జుజ అధికారి శ్రీ జంధ్యం మాధవి , ఐపిసి శ్రీ పబ్బ అరుణ , క్యాబినెట్ సెక్రటరీ అడ్మినిస్ట్రేటివ్ శ్రీ ఎల్లంకి ప్రదీప్ , రీజనల్ చైర్ పర్సన్ శ్రీ రాచమల్ల గాయత్రి , క్యాబినెట్ ట్రెజరర్ శ్రీ జిల్లా వేణుగోపాల్ క్యాబినెట్ ట్రెజరర్ శ్రీ బొద్ల సంతోష్ , శ్రీ కామిని తిరుమలేష్ గుప్తా , క్లబ్ అధ్యక్షుడు శ్రీ చిట్టుమల్ల సత్యనారాయణ , క్లబ్ కోశాధికారి శ్రీ పైడ రవి శ్రీ చిట్టి మల్ల సత్యనారాయణ , క్లబ్ కోశాధికారి శ్రీ పైడ రవి మాట్లాడుతూ గాంధీజీ బోధించిన అహింసావాదం గురించి, స్వాతంత్రోద్యమంలో తను నిర్వర్తించిన పాత్ర గురించి, గాంధీజీ మహాత్మాగా,జాతిపితగా ఎలా ఎదిగాడని వివరిస్తూ గాంధీజీ లాంటి గొప్ప వ్యక్తి మన వైశ్య జాతిలో పుట్టడం మనకు గర్వకారణం అని తెలియజేశారు ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు అందరూ అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేసినందుకు మా హృదయపూర్వక ధన్యవాదాలు .

## వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ వారి క్యాలెండర్ ఈవెంట్లో భాగంగా...






**గంగాధర జనవరి 30(పిసిడబ్ల్యూ న్యూస్):**కరీంనగర్ జిల్లా కరీంనగర్ లో ఈరోజు వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ వారి సూచన మేరకు క్యాలెండర్ ఈవెంట్ లో భాగంగా వాసవి క్లబ్ కాపుల్స్ కరీంనగర్ ఆధ్వర్యంలో 30-01-2026, శుక్రవారం రోజున ఉదయం 9..30 నిమిషములకు మన జాతిపిత మహాత్మ గాంధీజీ గారి వర్ధంతి సందర్భంగా కరీంనగర్ కోతి రాంపూర్ లోని గాంధీ విగ్రహం వద్ద మహాత్మా గాంధీ కి పూలమాల వేసి ఘనంగానివాళులు అర్పించడం జరిగింది మరియు క్లబ్ సభ్యులందరూ స్వచ్ఛభారత్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఐ ఈ సి అధికారి శ్రీ జంధ్యం మాధవి ,జంధ్యం మధుకర్ మాజీ అధ్యక్షుడు వాసవి క్లబ్ కాపుల్స్ కెఎన్ఆర్ ఐపిసి శ్రీ పబ్బ అరుణ , క్యాబినెట్ సెక్రటరీ అడ్మినిస్ట్రేటివ్ శ్రీ ఎల్లంకి ప్రదీప్ , రీజనల్ చైర్ పర్సన్ శ్రీ రాచమల్ల గాయత్రి , క్యాబినెట్ ట్రెజరర్ శ్రీ జిల్లా వేణుగోపాల్,క్యాబినెట్ ట్రెజరర్ శ్రీ బొద్ల సంతోష్ , శ్రీ కేసీజీ ఎఫ్ ఇంచార్జి సామ అశోక్ , క్లబ్ అధ్యక్షుడు శ్రీ1జిల్లా జగదీష్ , క్లబ్ ఉపాధ్యక్షుడు పి విజయకుమార్గారు మాట్లాడుతూ గాంధీజీ బోధించిన అహింసావాదం గురించి, స్వాతంత్రోద్యమంలో తను నిర్వర్తించిన పాత్ర గురించి, గాంధీజీ మహాత్మాగా,జాతిపితగా ఎలా ఎదిగాడని వివరిస్తూ గాంధీజీ లాంటి గొప్ప వ్యక్తి మన వైశ్య జాతిలో పుట్టడం మనకు గర్వకారణం అని తెలియజేశారు ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు అందరూ అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేసినందుకు మా హృదయపూర్వక ధన్యవాదాలు సదా వాసవి మాత, వాసవియాన్ల సేవలో.

## అల్గునూర్‌లో ఎమ్మెల్యే ఇంటింటా ప్రచారం...





**కరీంనగర్,జనవరి30(పీసీడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని 8వ డివిజన్ (అల్గునూర్) లో మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గోపు మల్లారెడ్డి కి మద్దతుగా ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా అలుగునూర్ లోని పాత శివాలయం ప్రాంతంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ అలుగునూరు గ్రామాన్ని ఇప్పటికే అభివృద్ధి పర్చామని, గోపు మల్లారెడ్డిని కార్పొరేటర్ గా గెలిపిస్తే మరింత అభివృద్ధి చెందుతుందని చెప్పారు. అభివృద్ధి కాంగ్రెస్ పాలనలోనే సాధ్యమని, ఇందుకు ఈ గ్రామమే నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. నిరంతరం గ్రామ అభివృద్ధి కోసం తపనపడే గోపు మల్లారెడ్డిని గెలిపిస్తే అభివృద్ధికి మరింత సహకరిస్తానని చెప్పారు. ఈ ప్రచారంలో పార్టీ అభ్యర్థి గోపు మల్లారెడ్డి, డివిజన్ పార్టీ అధ్యక్షుడు తమ్మనవేని రమేష్ యాదవ్, మాజీ కార్పొరేటర్ చల్లా రవీందర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కంది లక్ష్మీనారాయణ రెడ్డి, కంది అశోక్ రెడ్డి, మామిడి నరేందర్ రెడ్డి, చిందం కిష్టయ్య, జాప ప్రశాంత్ రెడ్డి,జాప రాఘవరెడ్డి, రవీందర్ రెడ్డి, సింగం శ్రీనివాస్, కొమురయ్య, చిల్ల రాములు, అజహరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## కరీంనగర్‌లో ఎంఐఎం పార్టీ నుంచి 15 మంది అభ్యర్థులకు బీ-ఫారంలు..











**కరీంనగర్ టౌన్ జనవరి 30(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల నేపథ్యంలో ఎంఐఎం పార్టీ తరపున మొత్తం 15 స్థానాలకు 15 మంది అభ్యర్థులకు బీ-ఫారంలను అధికారికంగా అందజేశారు. నిన్న విడుదల చేసిన తొలి జాబితాలో ఐదుగురు అభ్యర్థులకు, ఈరోజు విడుదల చేసిన రెండో జాబితాలో 10 మంది అభ్యర్థులకు బీ-ఫారంలను అందజేయడం ద్వారా మొత్తం 15 స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేశారు. ఎంఐఎం పార్టీ అధినేత, హైదరాబాద్ ఎంపీ బారిష్టర్ అసదుద్దీన్ ఓవైసీ ఆదేశాల మేరకు, కరీంనగర్ ఎంఐఎం పార్టీ ఉమ్మడి జిల్లా ఎన్నికల పరిశీలకులు యాసర్ అర్ఫాద్ చేతుల మీదుగా, పార్టీ కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ సారథ్యంలో ఈ కార్యక్రమం నిర్వహించబడింది. **బీ-ఫారంలు పొందిన అభ్యర్థులు:** 1. 43వ డివిజన్ ఖాన్ షా అబ్దుల్లా 2. 60వ డివిజన్ నసీం సుల్తాన 3. 61వ డివిజన్ ఆతిఫ్ ఆతిన 4. 31వ డివిజన్ ఆరిఫ్ అహ్మద్ 5. 34వ డివిజన్ ఖాజా మజారుద్దీన్ 6. 32వ డివిజన్ అబ్బాస్ సమీ 7. 33వ డివిజన్ జహేరా బానో 8. 5వ డివిజన్ అయేషా ఫాతిమా 9. 37వ డివిజన్ అహ్మద్ మొహియుద్దీన్ (బాబు జానీ) 10. 59వ డివిజన్ సనా ఫాతిమా 11. 52వ డివిజన్ చాడ (అన్నేమల్ల) అనూష 12. 30వ డివిజన్ కొమ్ముల రామేశ్వరీ 13. 54వ డివిజన్ తజీన్ ఫాతిమా 14. 64వ డివిజన్ రుఖయ ఫాతిమా 15. 65వ డివిజన్ మొహసీన్ మొహియుద్దీన్ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


## ఎంఐఎం పార్టీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం..






**కరీంనగర్ టౌన్ జనవరి 30(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ అలంను తురుకోడా అని దూషించిన అంశాన్ని తీవ్రంగా ఖండిస్తూ నగరంలోని హౌసింగ్ బోర్డ్ చౌరస్తా లో హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి దిష్టిబొమ్మను ఎంఐఎం పార్టీ కార్యకర్తలు నాయకులు శుక్రవారం రాత్రి దగ్ధం చేశారు. కౌశిక్ రెడ్డి డౌన్ డౌన్ ఖబర్దార్ కౌశిక్ రెడ్డి అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎంఐఎం నాయకులు మాట్లాడుతూ కౌశిక్ రెడ్డి తక్షణమే తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని లేకుంటే కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో తిరగనివ్వమని, ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఒకవైపు బిఆర్ఎస్ అధినేత కేసిఆర్ గంగా జమున తెహజీబ్ను కాపాడాలని చెబుతుంటే మరోవైపు కౌశిక్ రెడ్డి కేసిఆర్ ఆశయాలను తుంగలో తొక్కి, ముస్లింలను తురుకోడా అని సంబోధించడం రాజకీయ అవివేకానికి నిదర్శనమని అభివర్ణించారు. ఐదేళ్లు ఎమ్మెల్యేగా ఉండిపోయే కౌశిక్ రెడ్డి, 40 సంవత్సరాలు దేశం కోసం సేవ చేసే ఐపీఎస్ ను అసభ్య పదాజాలంతో దూషించడం సరికాదన్నారు. కౌశిక్ రెడ్డికి రాజకీయ పరిపక్వత లేదని కేవలం నోటి దురుసుతో రాజకీయ జీవితం తనంతట తానే నాశనం చేసుకుంటూ బిఆర్ఎస్ పార్టీని ముస్లిం సమాజంలో అభాసపాలు చేస్తున్నాడని ఆరోపించారు. ఇప్పటికైనా కేసీఆర్, కేటీఆర్ లు స్పందించి కౌశిక్ రెడ్డి పై పార్టీ పరమైన చర్యలను తీసుకోవాలని, క్షమాపణ చెప్పించాలని భవిష్యత్తులో కౌశిక్ రెడ్డి ఏ కులాన్ని, మతాన్ని కించపరచకుండా నోటిని అదుపులో ఉండేట్లు జాగ్రత్తలు చెప్పాలని డిమాండ్ చేశారు. ముస్లిం సమాజానికి, సిపి గౌస్ ఆలం కు, కౌశిక్ రెడ్డి క్షమాపణ చెప్పకుంటే కరీంనగర్లో కౌశిక్ రెడ్డి ఎక్కడ అడుగుపెట్టిన తన్ని తరుముతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎం నాయకులు, ఎండి రఫీ, ఖాజా మొయినుద్దీన్, , ఖమరొద్దీన్ షబ్బీర్, ఎండి రఫీ, నిజం, ఆయుబ్ అలీ, మిస్కిన్, ఇలియాజ్, ఇర్ఫాన్, సయ్యద్, ఖాజా, అల్తాఫ్, ముజ్జు, జబ్బార్, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన బార్ కౌన్సిల్ ఎన్నికల పోలింగ్..



**కరీంనగర్ టౌన్ జనవరి 30 (పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా కోర్టు ఆవరణలో డిస్ట్రిక్ట్ లీగల్ అథారిటీ సర్వీస్ భవనంలో రాష్ట్ర బార్ కౌన్సిల్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసినవని ఎన్నికల నోడల్ ఆఫీసర్ కసుగంటి మాధవర రావు శుక్రవారం తెలిపారు. కరీంనగర్ జిల్లా లో 1217 న్యాయ వాదులు ఓటు హక్కు కలిగి ఉండగా, 945 మంది మాత్రమే తమ ఓటు హక్కు ను వినియోగించుకున్నారు. ఎన్నికల ఫలితాలు ఫిబ్రవరి 10 నుండి మొదలు కానున్నట్లు, రాష్ట్ర వ్యాప్తంగా 23 మంది మెంబర్లకు గాను 203 మంది పోటీ చేశారు. ప్రిసైడింగ్ ఆఫీసర్ గా ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి శారీన మొహమ్మద్ వ్యవహరించారు. ఈ ఎన్నికల్లో బార్ అసోసియేషన్ అధ్యక్షులు లింగంపల్లి నాగరాజు, బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు, పోటీ లో ఉన్న అభ్యర్థులు, మాజీ ఎమ్మెల్యే అరెపెల్లి మోహన్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్మన్ రావు, మాజీ సుడా చైర్మన్ జీవి రామకృష్ణ రావు, బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, ఉప్పుల అంజన్ కుమార్, సీనియర్, జూనియర్ న్యాయ వాదులు, మహిళ న్యాయవాదులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఖబర్దార్ కౌశిక్ రెడ్డి.. నీకు తుర్కోడా అనే దమ్ము వచ్చిందా బిడ్డా..

**• నువ్వు ఎమ్మెల్యేవా..వీధి రౌడీవా..? • బహిరంగ క్షమాపణ చెప్పకుంటే బట్టలు ఊడదీస్తాం... • కౌశిక్ రెడ్డిలోని ఆర్ఎస్ఎస్ భావజాలం బయటపడింది • నీకు.. నీగురువు కేసీఆర్ కు రాజకీయ పునర్జన్మను ఇచ్చింది ముస్లింలే... • వ్యక్తిగతంగా విమర్శలు చేసుకో కానీ..తుర్కోడని కించపరిస్తే నాలుక చీరేస్తాం • సిపి గౌష్ ఆలంపై.. ముస్లింలను ఉద్దేశించి ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండించిన ఎంఐఎం నేత గులాం అహ్మద్ హుస్సేన్**

**కరీంనగర్ టౌన్ జనవరి 30(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలంను ఉద్దేశించి బహిరంగంగా తుర్కోడని అసభ్య పదజాలంతో..వీధి రౌడీ మాదిరిగా కించపరిచే వ్యాఖ్యలు చేసిన హుజురాబాద్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిని, ఎమ్మెల్యే పదవి నుంచి తొలగించాలని, ఎంఐఎం కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ రాష్ట్ర ప్రభుత్వానికి, అసెంబ్లీ స్పీకర్ కు, ఒక ప్రకటనలో శుక్రవారం విజ్ఞప్తి చేశారు. ఖబర్దార్ కౌశిక్ రెడ్డి నీకు తురుకోడని దమ్ము ఎలా వచ్చిందని తక్షణమే బహిరంగ క్షమాపణలు చెప్పకుంటే నీ బట్టలూడదీస్తామని సిపిపై చేసిన వ్యాఖ్యలు గర్హనీయమని తీవ్రంగా ఖండించారు. కౌశిక్ రెడ్డిలో ఇన్నాళ్లు దాగి ఉన్న ఆర్ఎస్ఎస్ భావజాలం, ముస్లిం వ్యతిరేక ఆలోచన బయటపడిందన్నారు. కౌశిక్ రెడ్డి మదమెక్కినట్లు మాట్లాడితే ముస్లింలందరూ ఏకమై గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. నీకు, నీ రాజకీయ జన్మ ప్రసాదించిన కేసీఆర్ కు కేటీఆర్ కు, రాజకీయ పునర్జన్మను ఇచ్చింది ముస్లింలేనని గుర్తుపెట్టుకోవాలన్నారు. కౌశిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను తక్షణమే ఉపసంహరించుకొని ముస్లిం సమాజానికి బహిరంగ క్షమాపణ చెప్పకుంటే తెలంగాణలో కౌశిక్ రెడ్డిని తిరగనివ్వమని హెచ్చరించారు. నీ దాదాగిరి ఇంట్లో చూపెట్టుకోవాలి కానీ ముస్లింల మీద కాదని, వ్యక్తిగతంగా విమర్శలు చేసుకోవాలి గాని తురుకోవడానికి కించపరిస్తే నాలుక చీరేస్తామన్నారు. రాబోయే రోజుల్లో కౌశిక్ రెడ్డికి రాజకీయ సమాధి కట్టేందుకు ముస్లింలందరూ ఏకమై, బిఆర్ఎస్ పార్టీకి వ్యతిరేకంగా ఓటు వేసి, ప్రస్తుత మున్సిపల్ ఎన్నికల్లో తీర్పు ఇవ్వాలని ముస్లిం సమాజానికి గులాం అహ్మద్ పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే హోదాలో కౌశిక్ రెడ్డి తురుకోడని వ్యాఖ్యలు చేయడం ఎమ్మెల్యే పదవికి కళంకం తెచ్చాడన్నారు. ఎవరి పై పడితే వారిపై నోటి దురుసు ప్రయోగిస్తే ఊరుకున్నారు.. కానీ ముస్లిం సమాజం కౌశిక్ రెడ్డిని ఉరికిచ్చి కొడుతుందన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజాప్రతినిధిగా ఉన్న కౌశిక్ రెడ్డి హుందాతనంగా మెలగాలి కానీ చిల్లర మాటలు మాట్లాడడం అవివేకానికి నిదర్శనం అన్నారు. తక్షణమే తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.



## హుజురాబాద్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలి: మొహమ్మద్ తాజోద్దిన్..

**కరీంనగర్ టౌన్ జనవరి 30(పిసిడబ్ల్యూ న్యూస్):** హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఒక వీధి రౌడీలా మాట్లాడటం సిగ్గుచేటు అని జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనారిటీ చైర్మన్ మొహమ్మద్ తాజోద్దిన్ తీవ్రంగా విమర్శించారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల వీణవంకలో జరిగిన సమ్మక్క–సారలమ్మ జాతర సందర్భంగా హైకోర్టు ఆదేశాల మేరకు కుటుంబ సభ్యులకే అనుమతి ఉందని పోలీసులు సూచించినప్పటికీ, ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి మద్దతుదారులతో అక్కడికి వెళ్లి గొడవకు దిగారని తెలిపారు. జాతర నిర్వహణ హక్కులు పాడి సుధాకర్ రెడ్డి వంశీకులకే చెందుతాయని హైకోర్టు ఇప్పటికే తీర్పు ఇచ్చిందని గుర్తు చేశారు. డ్యూటీలో ఉన్న పోలీసు అధికారులపై దురుసుగా ప్రవర్తించడమే కాకుండా, జిల్లా పోలీసు అధికారి సీపీ




గౌస్ ఆలం గారిపై కులం పేరుతో అవమానకరంగా మాట్లాడటం తీవ్రంగా ఖండనీయమన్నారు. ఇది ముస్లిం సమాజాన్ని కించపరిచే చర్యగా పేర్కొన్నారు.కౌశిక్ రెడ్డి గతంలోనూ అనేక వివాదాల్లో ఇరుక్కున్నారని, ఉద్యోగాలు ఇప్పిస్తానని, ఎమ్మెల్యే టికెట్ ఇప్పిస్తానని డబ్బులు వసూలు చేసిన ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. ఎన్నికల ప్రచారంలో ప్రజలను భావోద్వేగాలతో మోసం చేసి గెలిచారని విమర్శించారు. గతంలో జిల్లా సమీక్ష సమావేశంలో జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పై దురుసుగా ప్రవర్తించిన ఘటనను కూడా గుర్తు చేశారు. ఇప్పుడు ఐపీఎస్ అధికారిపై కులపేరుతో మాట్లాడటం మరింత బాధాకరమన్నారు. ముస్లింలను కించపరిచే వ్యాఖ్యలపై కేసులు నమోదు చేసేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల చట్టం తీసుకొచ్చారని పేర్కొంటూ, ఆ చట్టం ప్రకారం కౌశిక్ రెడ్డిపై తెలంగాణలో తొలి కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. టీఆర్ఎస్ (బీఆర్ఎస్) పార్టీ సెక్యులర్ పార్టీ అని చెప్పుకుంటూ బీజేపీ కంటే హీనంగా మాట్లాడటం తగదన్నారు. కేసీఆర్, కేటీఆర్‌లు ఈ వ్యవహారంపై చర్యలు తీసుకుని కౌశిక్ రెడ్డిని పార్టీ నుంచి బహిష్కరించాలని కోరారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి ముస్లింలు ఓటు వేయవద్దని పిలుపునిచ్చారు. హుజురాబాద్‌కు వచ్చి తగిన విధంగా బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మైనారిటీ నాయకులు నేహాల్ అహ్మద్, లయాక్ ఖాద్రీ, అబ్దుల్ రహ్మాన్, మొహమ్మద్ కలిమొద్దీన్, ఆరిఫ్ ఖాన్, సయ్యద్ కరీం తదితరులు పాల్గొన్నారు.

## ఆదరించి గెలిపించండి గ్రామాన్ని అభివృద్ధి చేస్తాం






**కల్లూరు,జనవరి 30 (పిసిడబ్ల్యూ న్యూస్) :** కల్లూరు మున్సిపాలిటీ పరిధిలో 10, 11 వార్డు కౌన్సిలర్ కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని పెద్దబోయన లక్ష్మీ నరసింహారావు, కిస్టంశెట్టి లక్ష్మి ఏడుకొండలు అభ్యర్థించారు. శుక్రవారం పుల్లయ్య బంజర గ్రామంలో పెద్దబోయిన లక్ష్మీ నరసింహారావు నివాస గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 10వ వార్డు కౌన్సిలర్ గా పెద్దబోయన లక్ష్మీ నరసింహారావు పోటీ చేయడం జరుగుతుందని తెలిపారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల మీదనే దృష్టి కేంద్రీకరించి వారి క్షేమాభివృద్ధి కొరకు పనిచేయడం జరుగుతుందని తెలిపారు. గ్రామంలో ఏ సమస్య వచ్చినా వారి పక్షాన నిలబడి వారిని ఆదుకోవడం జరుగుతుందని అన్నారు. గత రెండు సంవత్సరాల కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారా లక్షల రూపాయలు అభివృద్ధి కార్యక్రమాలు పుల్లయ్యబంజర, లోకారం గ్రామాల్లో చేశాయని ఇంకా ముందున్న కాలములో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. బిఆర్ఎస్ ప్రభుత్వంలో 10 సంవత్సరాల కాలంలో ఎటువంటి అభివృద్ధి జరగలేదని వారు ఆరోపించారు. అధికార పార్టీలో ఉన్న మేము ఏనాడు గ్రామాల్లో కేసులు పెట్టి ఎవరిని ఇబ్బంది పెట్టలేదని అన్నారు. కేసులు పెట్టి ఇబ్బంది పెట్టే పరిస్థితి మా పాలసీ కాదని మంచి చేయడమే తప్ప చెడు చేయడం అనేది లేదని అన్నారు. ఈ సందర్భంగా సీనియర్ కాంగ్రెస్ నాయకులు క్రిస్టశేశెట్టి ఏడుకొండలు మాట్లాడుతూ 11 వ వార్డ్ లో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థిగా నా సతీమణి కృష్ణశేశెట్టి లక్ష్మి నామినేషన్ దాఖలు చేయడం జరిగింది తెలిపారు. ఎన్నో ఏళ్లగా కాంగ్రెస్ పార్టీని నమ్ముకుంటూ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తున్నామని ఈరోజు ఈ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ బతికి ఉందంటే మేము చేసిన కష్టమేనని అన్నారు. ఎన్ని ఇబ్బందులు వచ్చిన పార్టీని వీడకుండా పార్టీనే నమ్ముకుని పనిచేసామని తెలిపారు. మా కష్టాన్ని గుర్తించి కాంగ్రెస్ పార్టీ సత్తుపల్లి శాసన సభ్యురాలు మట్టా రాగమయి దయానంద్, మా ప్రియతమ నాయకులు రాష్ట్ర నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు మాకు కౌన్సిలర్ అభ్యర్థులుగా సీట్లు కేటాయించడం పై కృతజ్ఞతలు తెలిపారు. గ్రామస్తులు మా నాయకత్వాన్ని బలపరిచి 10 వార్డు కౌన్సిలర్ పెద్దబోయిన లక్ష్మీనరసింహారావు ను,11 వార్డు కౌన్సిలర్ కిష్టంశెట్టి లక్ష్మి ని ఆదరించి గెలిపించాలని కోరారు. సత్తుపల్లి శాసనసభ్యురాలు మట్ట రాగమయి దయానంద్ వారి ఆధ్వర్యంలో గ్రామాన్ని అభివృద్ధి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాడిశెట్టి శ్రీనివాసరావు, బందెల రాధాకృష్ణమూర్తి, శివాలయం చైర్మన్ మాడిశెట్టి వెంకటేష్, బుర్రి కనకయ్య, రంగు లక్ష్మణరావు, జక్కు కృష్ణయ్య, తండు రాములు, రచబంటి శ్రీనివాసరావు, బుర్రీ వీరయ్య, వెంకట్,కుటుంబరావు,శివ పలువురు పాల్గొన్నారు.

## శాంతినగర్ నమ్మకం.... నెంబర్ వెంకట్

**• ప్రజల కోసమే ఉన్న నాయకుడు నెంబర్ వెంకట్ • శాంతినగర్‌లో సేవకు మరో పేరు.. నమ్మకానికి నిలువెత్తు ప్రతీక**

**కల్లూరు, జనవరి 30 (పిసిడబ్ల్యూ న్యూస్) :** కల్లూరు మున్సిపాలిటీ పరిధిలో శాంతినగర్‌లో "నెంబర్ వెంకట్" అని తెలియని వారు ఉంటారా అంటేడ ఉండరనే చెప్పాలి. ఏ గడప తొక్కినా, ఏ ఇంటి ముంగిట నిలబడ్డా, అక్కడ నెంబర్ వెంకట్ (కొత్తపల్లి వెంకటేశ్వర్లు) చేసిన సేవ, అందించిన సహాయం తప్పక వినిపిస్తుంది. ప్రజలకు అండగా నిలవడం అంటే ఏమిటో తన జీవితం ద్వారా నిరూపించిన నిజమైన ప్రజాసేవకుడు ఆయన. మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో మూడుసార్లు వార్డు మెంబర్‌గా పనిచేసిన అనుభవం ఆయనకు ప్రజల సమస్యలపై లోతైన అవగాహనను అందించింది. ప్రజల సమస్యలను ఎలా వినాలి, ఆపదలో ఉన్నవారిని ఎలా ఆదుకోవాలి అన్నది పుస్తకాల ద్వారా కాదు అనుభవం ద్వారా నేర్చుకున్న సత్యం.ఆపదలో ఉన్నవారు పిలిచిన వెంటనే ఆలస్యం చేయకుండా వారి వద్దకు చేరుకుని, ఆప్యాయంగా పలకరించి, ధైర్యం చెప్పే గుణశీలుడు నెంబర్ వెంకట్. మాటలతోనే కాదు చేతలతోనూ ఓదార్పు ఇచ్చే మనిషి. శాంతినగర్‌లో అనేక కుటుంబాలకు ఆయన చేసిన సహాయం అతిశయోక్తి కాదు, అది అక్షర సత్యం.నెంబర్ వెంకట్ ప్రత్యేకత ఏమిటంటే , ముందు ఒక మాట, వెనుక ఒక మాట చెప్పే వ్యక్తి కాదు. ఉన్నదున్నట్టుగా మాట్లాడే యథార్థవంతుడు. ఎప్పుడూ న్యాయం వైపే నిలబడే వ్యక్తి.అన్యాయానికి కొమ్ముకాయడు. సమస్యలను పెంచే మనస్తత్వం కాదు, పరిష్కరించాలనే తపన ఉన్న నాయకుడు.నీళ్లు, కరెంటు, పారిశుధ్యం, డ్రైనేజ్, రోడ్లుడ సమస్య ఏదైనా సరే వెంటనే స్పందించి అధికారులతో మాట్లాడి, తన ప్రియతమ నేత మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య సహకారంతో శాంతినగర్‌కు అనేక అభివృద్ధి కార్యక్రమాలను తీసుకువచ్చిన ఘనత నెంబర్ వెంకట్‌కే దక్కుతుంది.ప్రతి ఇంటికి ఏ కష్టం వచ్చినా ప్రతి ఇంటికి ఏ ఆపద వచ్చినా "నేనున్నాను" అంటూ తలుపు తట్టిన వ్యక్తి నెంబర్ వెంకట్ మాత్రమే. ఎటువంటి స్వార్థం లేకుండా ప్రజలకు అండగా నిలవాలనే తపన ఆయనలో సహజంగా కనిపిస్తుంది. తన చేతనైన సహాయం ఏదో ఒకటి చేయాలనే మనసే ఆయనను నిజమైన ప్రజాసేవకుడిగా నిలబెడుతోంది. ఇప్పుడు శాంతినగర్‌కు మరో అవకాశం వచ్చింది. 19వ వార్డు కౌన్సిలర్‌గా నెంబర్ వెంకట్ సతీమణి కొత్తపల్లి దేవమణి ఎన్నికల బరిలో ఉన్నారు. ఇది కేవలం ఒక ఎన్నిక కాదు ప్రజల భవిష్యత్తును నిర్ణయించే కీలక అవకాశం. ఎవరైతే మన కష్టాలు తీర్చగలరో,ఎవరైతే మన ఆపదలో అండగా ఉంటారో,ఎవరైతే మన సమస్యలను తమ సమస్యలుగా భావిస్తారో అలాంటి నాయకత్వాన్ని ఎన్నుకోవాల్సిన సమయం ఇది. ప్రజల హృదయాలను గెలుచుకున్న సేవే నిజమైన రాజకీయ శక్తి. ఆ సేవకు ప్రతిరూపమే నెంబర్ వెంకట్ (కొత్తపల్లి వెంకటేశ్వర్లు) బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య నాయకత్వాన్ని బలపరుస్తూ 19వ వార్డు కౌన్సిలర్ గా నిలబడ్డ కొత్తపల్లి దేవమని నీ తన ఎన్నికల గుర్తు కారు గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవలచిన అవసరం ఎంతైనా ఉంది.



## శ్రీ బోయకొండ గంగమ్మను దర్శించుకున్న డీఐజీ,కోయ ప్రవీణ్



**అన్నమయ్య జిల్లా : పుంగనూరు.జనవరి 30( పి సి డబ్ల్యూ న్యూస్ ప్రతినిధి):** పుంగనూరునియోజకవర్గం చౌడేపల్లి మండలం దిగువపల్లి గ్రామం వద్ద వెలసి ఉండు భక్తుల కోరిన కోరికలు తీర్చే కల్పవల్లి విరాజిల్లుతున్న శ్రీ బోయకొండ గంగమ్మ అమ్మవారిని కర్నూలు రేంజ్ డీఐజీ కోయా ప్రవీణ్ దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన ఆయనను ఆలయ ఈవో ఏకాంబరం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శన ఏర్పాట్లు కల్పించారు. అనంతరం అమ్మవారి పవిత్ర తీర్థప్రసాదాలు జ్ఞాపికను అందజేశారు. అన్నమయ్య జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి, మదనపల్లి డి.ఎస్.పి మహేంద్ర సిఐలు సుబ్బరాయుడు, సాయి ప్రసాద్, ఎస్సై నాగేశ్వరరావు ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వనదేవతలు సమ్మక్క - సారలమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం




**గంగాధర జనవరి 30 (పీసీడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలం మధురానగర్ గ్రామంలో సమ్మక్క – సారళమ్మల జాతర మహోత్సవంలో సందర్భంగా గద్దెలపై కొలువు తీరిన వనదేవతలను దర్శించుకొని , సమ్మక్క సారక్క గద్దెల వద్ద హైమాక్స్ లైట్స్ కావాలని అడగగానే ఇచ్చి వాటిని ప్రారంభించిన గౌరవ చొప్పదండి శాసనసభ్యులు & కరీంనగర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డా. శ్రీ మేడిపల్లి సత్యం మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా మల్లికార్జున స్వామి కళ్యాణ మహోత్సవం

**రామన్నపేట జనవరి 30 (పీసీడబ్ల్యూ న్యూస్):** రామన్నపేట మండలం సిరిపురం గ్రామంలో మల్లికార్జున స్వామి కళ్యాణ మహోత్సవం ఘనంగా జరిగినది ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ అంబటి ఉపేంద్ర రవీందర్ రెడ్డి హాజరై గ్రామ ప్రజలను చల్లగా చూడాలని మల్లికార్జున స్వామిని వేడుకున్నారు



# భారత జెర్సీ మీ లక్ష్యం కావాలి

## గాయాల్లేని క్రీడా ప్రయాణమే నిజమైన విజయం: డాక్టర్ ఎమ్.జీ.వి. ప్రవీణ్ కుమార్









**ఖమ్మం ప్రతినిధి, జనవరి 30 (పిసిడబ్ల్యూ న్యూస్) :** భారత మహిళా క్రికెట్ జట్టులో తమ పేరు తప్పక ఉండాలన్న స్పష్టమైన లక్ష్యంతో ప్రతి క్రీడాకారిణి ముందుకు సాగాలని ప్రముఖ ఈఎన్‌టీ వైద్యులు డాక్టర్ ఎమ్.జీ.వి. ప్రవీణ్ కుమార్ మహిళా క్రికెటర్లకు పిలుపునిచ్చారు. ఖమ్మం జిల్లా కేంద్రంలోని ఎస్.ఆర్ & బి.జి.ఎన్.ఆర్ ప్రభుత్వ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న ఇందిరాగాంధీ 5వ జాతీయ స్థాయి సీనియర్ మహిళా టీ20 క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. ఈ టోర్నమెంట్‌లో ఉత్తరప్రదేశ్, విధర్భ సహా దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన మహిళా క్రికెట్ జట్లు పాల్గొంటున్నాయి. ప్రారంభోత్సవంలో క్రీడాకారిణులతో ప్రత్యేకంగా మాట్లాడిన డాక్టర్ ప్రవీణ్ కుమార్, ప్రాణం పెట్టి ఆడుతున్న మీ కృషి ఎప్పటికీ వృథా కాకూడదని అన్నారు. లక్ష్యాన్ని స్పష్టంగా నిర్దేశించుకుని క్రమశిక్షణతో నిరంతర సాధన చేస్తే భారత జట్టులో స్థానం సాధించడం ఖాయమని విశ్వాసం వ్యక్తం చేశారు. విజయం ఎంత ముఖ్యమో ఆరోగ్యం అంతకంటే ముఖ్యమని పేర్కొంటూ, క్రీడల్లో గాయాలు కాకుండా సరైన వార్మప్, ఫిట్‌నెస్, జాగ్రత్తలు పాటిస్తూ క్రీడా మెలకువతో ఆడాలని సూచించారు. గాయాల్లేని క్రీడా ప్రయాణమే నిజమైన విజయానికి నిదర్శనమని చెప్పారు. ప్రారంభానికి ముందు క్రీడాకారిణులను పరిచయం చేసుకుని వారిని ఉత్సాహపరుస్తూ పలు విలువైన సూచనలు చేశారు. అనంతరం డాక్టర్ ఎమ్.జీ.వి. ప్రవీణ్ కుమార్ స్వయంగా బ్యాట్ పట్టి బ్యాటింగ్ చేసి క్రీడాకారిణుల్లో క్రీడాస్ఫూర్తిని నింపారు. జాతీయ స్థాయి మహిళా క్రికెట్ టోర్నమెంట్‌ను సమర్థవంతంగా, సక్రమంగా నిర్వహిస్తున్న ఖమ్మం క్రికెట్ అసోసియేషన్ కన్వీనర్ మహమ్మద్ మతిన్ కృషిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో వివిధ రాష్ట్రాల మహిళా క్రికెట్ జట్ల సభ్యులు, క్రీడా నిర్వాహకులు, అధికారులు, క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**టీ20 క్రికెట్ టోర్నీలో ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్ ఫైనల్ జట్లు**

ఇందిరాగాంధీ సీనియర్ మహిళా టీ20 క్రికెట్ టోర్నీలో ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్ జట్లు ఫైనల్‌కు చేరాయి. తొలి సెమీఫైనల్‌లో ఉత్తరప్రదేశ్‌విదర్భ జట్ల మధ్య జరిగిన ఉత్కంఠభరిత మ్యాచ్‌లో ఉత్తరప్రదేశ్ 14 పరుగుల తేడాతో విజయం సాధించింది. ముందుగా బ్యాటింగ్ చేసిన ఉత్తరప్రదేశ్ 20 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 142 పరుగులు చేసింది. తను సింగ్ 53 బంతుల్లో 63 పరుగులు, ఖుషి పాల్ 45 పరుగులతో రాణించారు. బౌలింగ్‌లో విదర్భ బౌలర్లు స్వర తాక్రె, కల్యాణి కుట్టి, గ్రీష్మ టాలా చెరో వికెట్ తీశారు. ప్రత్యుత్తరంగా విదర్భ 20 ఓవర్లలో 5 వికెట్లకు 128 పరుగులకే పరిమితమైంది. ప్రాచి 33 పరుగులు చేసింది. ఉత్తరప్రదేశ్ బౌలింగ్‌లో కట్టుదిట్టమైన ప్రదర్శనతో విజయం దక్కింది. రెండో సెమీఫైనల్‌లో ఉత్తరాఖండ్, ఢిల్లీపై 93 పరుగుల భారీ తేడాతో గెలిచి ఫైనల్ బెర్త్ ఖరారు చేసుకుంది. ఉత్తరాఖండ్ బ్యాటర్ 56 బంతుల్లో 13 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 106 పరుగులు చేసి జట్టును భారీ స్కోర్‌కు నడిపించింది. రేఖ 21 పరుగులు చేసింది. ఢిల్లీ తరఫున మహిమ శుక్లా 2 వికెట్లు తీసింది. ఢిల్లీ జట్టు 8 వికెట్లు కోల్పోయి 113 పరుగులకే ఆలౌటైంది. ఉత్తరాఖండ్ బౌలర్ పూనమ్ 4 వికెట్లు, ఖుషి 2 వికెట్లు తీసి విజయంలో కీలక పాత్ర పోషించారు.

**ఐదవ ఇందిరాగాంధీ మహిళల ఛాంపియన్షిప్ క్రీడాకారులకు నాణ్యమైన భోజన వసతి చక్రధర్ ఫౌండేషన్, రాజస్థాన్ మార్బుల్ సంస్థల సేవాభావానికి ప్రశంసలు**

ఖమ్మంలో జరుగుతున్న ఐదవ ఇందిరాగాంధీ జాతీయ స్థాయి మహిళల క్రికెట్ ఛాంపియన్షిప్‌లో పాల్గొన్న క్రీడాకారులకు చక్రధర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉత్తమమైన భోజన వసతి కల్పించడంతో క్రీడాకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చక్రధర్ ఫౌండేషన్ ఎక్స్‌ప్రెస్ రోబోటిక్ ఇంటెలిజెన్స్ డ్రోన్ టెక్నాలజీ స్ట్రీమ్ ఆటోమేషన్ అధినేత చక్రధర్ గారు, అలాగే రాజస్థాన్ మార్బుల్ సంస్థ అధినేతలు గుజ్జర్, భావర్జీ క్రీడాకారుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని చక్కటి, పోషకాహారంతో కూడిన భోజన ఏర్పాట్లు చేశారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన మహిళా క్రీడాకారులకు ఇంటి భోజనం తలపించే విధంగా ఏర్పాటు చేసిన వసతులపై వారు ప్రత్యేకంగా సంతృప్తి వ్యక్తం చేశారు. క్రీడల్లో ప్రతిభ చూపేందుకు సరైన ఆహారం ఎంత ముఖ్యమో నిరూపించేలా ఈ ఏర్పాట్లు ఉన్నాయని క్రీడాభిమానులు ప్రశంసిస్తున్నారు. ఈ సందర్భంగా చక్రధర్ ఫౌండేషన్ ప్రతినిధులు తమ సామాజిక సేవా కార్యక్రమాలు, యువత, క్రీడల అభివృద్ధి కోసం చేపడుతున్న కార్యక్రమాల వివరాలను ఖమ్మం ఎంపీ రఘు రాంరెడ్డి గారికి బ్రోచర్ రూపంలో అందజేశారు. క్రీడలకు, క్రీడాకారుల సంక్షేమానికి ముందుకు వచ్చే సంస్థలు మరింత పెరగాలని పలువురు అభిప్రాయపడ్డారు.

---

# కుష్టు వ్యాధి రహిత సమాజ నిర్మాణమే ధ్యేయం

**- కుష్టు వ్యాధి మందులతో పూర్తిగా నయమవుతుంది**

**- కుష్టు వ్యాధిగ్రస్థులపై వివక్ష చూపొద్దు**

**- మహాత్మాగాంధీ మార్గదర్శకాలు పాటించడమే వారికిచ్చే ఘన నివాళి**

**- జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**





**ఖమ్మం ప్రతినిధి, జనవరి 30 (పిసిడబ్ల్యూ న్యూస్) :** కుష్టు వ్యాధి రహిత సమాజ నిర్మాణమే ధ్యేయంగా ప్రతిఒక్కరు తమవంతు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో చేపట్టిన జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ముందుగా మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని జిల్లా కలెక్టర్, మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జాతిపిత మహాత్మాగాంధీ మార్గదర్శనంలో నడవడమే ఆయానకిచ్చే ఘన నివాళి అన్నారు. మహాత్మా గాంధీ ని ఒక జర్నలిస్ట్ మీ జీవితం ద్వారా ఏం చెప్పదల్చుకున్నారు అని అడుగగా, నా జీవితమే ఒక సందేశమని మహాత్మా గాంధీ అన్నారని తెలిపారు. ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని, వివక్షకు గురై ఎన్నో అవమానాలకు మహాత్మా గాంధీ గురయ్యారని అన్నారు. ఒక తెల్ల జాతీయుడు, మహాత్మా గాంధీ ని జాతి వివక్ష తో రైలు నుండి గెంటివేసినప్పుడు, సత్యానికి, న్యాయానికి మహాత్మా గాంధీ పోరాడారన్నారు. ఉప్పు సత్యాగ్రహం, దండి సత్యాగ్రహం లాంటి ఎన్నో ఉద్యమాలతో హింసకు తావులేకుండా, అహింసా మార్గంలో స్వాతంత్ర్యాన్ని సాధించారన్నారు. కుష్టు రోగులకు సమాజంలో వివక్ష, ఎదుర్కొంటున్న సమస్యలు గుర్తించి, వారికి ఆరోగ్యం, సమాజంలో వివక్ష తొలగించే విధంగా సబర్మతి ఆశ్రమంలో మహాత్మా గాంధీ సేవాలందించారన్నారు. కుష్టు వ్యాధి ఎవరి తప్పు కాదని, బాధితులను వివక్షకు గురిచేయవద్దని కలెక్టర్ అన్నారు. మందులతో పూర్తిగా నయమయ్యే జబ్బుని, కుష్టు రోగులకు సహాయంగా నిలవాలని అన్నారు. కుష్టు వ్యాధికి పూర్తి ఉచితంగా చికిత్స అందిస్తున్నామని, 12 నెలలు మందులు వాడితే పూర్తిగా నయమవుతుందని తెలిపారు. కుష్టు వ్యాధి లక్షణాలు, మచ్చలు ఏర్పడినప్పుడే, వెంటనే దగ్గర్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లాలన్నారు. జిల్లాలో గుర్తించిన 74 మంది కుష్టువ్యాధిగ్రస్థుల ఉచిత చికిత్స అందిస్తున్నామన్నారు. అనుమానిత ప్రతిఒక్కరికి పరీక్షలు చేయాలన్నారు. స్పర్శ కుష్టు వ్యాధి ప్రచార కార్యక్రమాన్ని 30 జనవరి నుండి 13 ఫిబ్రవరి వరకు నిర్వహించనున్నట్లు కలెక్టర్ అన్నారు. కుష్టు రహిత సమాజ నిర్మాణం, వ్యాప్తిని అడ్డుకోవడం, వ్యాధిగ్రస్తులపై ఉన్న కళంకాన్ని తొలగించి, వారికి గౌరవప్రదమైన జీవనాన్ని అందించడమే లక్ష్యంగా వెళ్ళాలన్నారు. కుష్టు వ్యాధిపట్ల ప్రజల్లో పెద్దఎత్తున అవగాహన కల్పించాలన్నారు. గ్రామస్థాయిలో సర్పంచ్ అధ్యక్షతన గ్రామసభలు నిర్వహించి ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేయాలన్నారు. కార్యక్రమంలో కుష్టు వ్యాధి నిర్మూలనకై అధికారులు, సిబ్బందిచే వాగ్దానం చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. రామారావు, డిసిహెచ్ఎస్ డా. రాజశేఖర్, అదనపు వైద్య ఆరోగ్య అధికారి డా. చందు నాయక్, ఉప జిల్లా వైద్య అధికారి డా. వేణు మనోహర్, కలెక్టరేట్ ఏవో కె. శ్రీనివాసరావు, వైద్యాధికారులు, వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

---

# పౌర హక్కులపై అవగాహన సదస్సు

**● రాజ్యాంగ హక్కులపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరం**

**● అర్బన్ తహసీల్దార్ సైదులు**







**ఖమ్మం ప్రతినిధి, జనవరి 30 (పిసిడబ్ల్యూ న్యూస్) :** షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఖమ్మం జిల్లా ఆధ్వర్యంలో ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని 60వ డివిజన్ రామన్నపేట ఎస్సీ కాలనీలో పౌర హక్కులపై అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. ఈ సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఖమ్మం అర్బన్ తహసీల్దార్ సైదులు మాట్లాడుతూ, సమాజంలో ప్రతి పౌరుడు రాజ్యాంగం కల్పించిన హక్కులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఎవరికైనా పౌర హక్కుల ఉల్లంఘన జరిగితే వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని, అవసరమైతే పోలీస్ శాఖ సహకారం కూడా పొందవచ్చని తెలిపారు. అనంతరం షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ, హెచ్డబ్ల్యూఓ నెల్లూరి విజయ మాట్లాడుతూ, ప్రజలకు నేరుగా పౌర హక్కులపై అవగాహన కల్పించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. ఇటువంటి అవగాహన సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం అర్బన్ ఎస్సై భీమా, ఆర్ఐలు కృష్ణ, సత్యనారాయణ, విఆర్వో బ్రహ్మం, గ్రామ పెద్దలు భోజెడ్ల సూర్యారావు, గుత్తా నరేష్, షేక్ జనిమియా, పీట్ల కృష్ణమూర్తి, పడిగెల నాగేశ్వరరావు, ఆరెంపల కొరివి, దోసపాటి శ్రీను, ఆరెంపల అంబేద్కర్, ఆరెంపల వెంకలు, వంకాయల యోహాను, బంక వెంకన్న, ఆరెంపల నరేష్, కీసరి నాగరాజు, డాక్టర్ నగేష్, నామ ఏసురత్నం, సాత్విక్, సన్నీ తదితరులు పాల్గొన్నారు. అలాగే పెద్ద ఎత్తున మహిళలు, స్థానిక ప్రజలు హాజరై పౌర హక్కులపై అవగాహన పొందారు.

---

# సత్యం, అహింసే గాంధీ వారసత్వం

**- జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్**

**- జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఘనంగా గాంధీ 78వ వర్ధంతి కార్యక్రమం**



**ఖమ్మం ప్రతినిధి, జనవరి 20 (పిసిడబ్ల్యూ న్యూస్) :** సత్యం, అహింసే గాంధీ వారసత్వం అని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ అన్నారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ అధ్యక్షతన జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్‌లో జాతిపిత మహాత్మా గాంధీ 78వ వర్ధంతి కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, శాసనమండలి మాజీ సభ్యులు బాలసాని లక్ష్మీనారాయణ, నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మద్దినేని బేబీ స్వర్ణకుమారి తదితర ముఖ్య నాయకులు గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం నూతి సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూసత్యం, అహింస, సత్యాగ్రహం అనే విలువలతో ప్రపంచానికి నైతిక రాజకీయానికి మార్గదర్శిగా నిలిచిన మహానేత మహాత్మా గాంధీ అని అన్నారు. గాంధీ సిద్ధాంతాలు లేకుండా దేశం ఇంతటి శాంతి, సామరస్యాన్ని పొందేదే కాదని పేర్కొన్నారు. అమెరికాలో నల్లజాతీయుల హక్కుల కోసం పోరాడిన మార్టిన్ లూథర్ కింగ్, దక్షిణాఫ్రికాలో వర్ణవివక్షకు వ్యతిరేకంగా ఉద్యమించిన నెల్సన్ మండేలా కూడా గాంధీ అహింసా మార్గాన్నే ఆదర్శంగా తీసుకున్నారని గుర్తు చేశారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఏడున్నర దశాబ్దాలు గడిచినా గాంధీని హత్య చేసిన గాడ్సేను కీర్తిస్తూ కొందరు వ్యాఖ్యలు చేయడం భారతజాతి నైతిక విలువలపై దాడి చేయడమేనని విమర్శించారు. అస్పృశ్యత నిర్మూలన కోసం గాంధీ చేసిన పోరాటం చిరస్మరణీయమని, అన్ని మతాలు, జాతులు కలిసిమెలిసి జీవించాలనే ఆయన ఆశయానికి ప్రాణమే మూల్యంగా చెల్లించారని అన్నారు. ప్రజాస్వామ్యంలో హింసను, హత్యలను సమర్థించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని స్పష్టం చేశారు. గాంధీ చూపిన మార్గంలో నడవడమే ఆయనకు మనమిచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఓబీసీ సెల్ ఉపాధ్యక్షులు వడ్డేబోయిన నరసింహారావు, రాష్ట్ర యువజన కార్యదర్శి జెర్రిపోతుల అంజనీ కుమార్, జిల్లా అనుబంధ సంఘాల నాయకులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, ఓబీసీ సెల్, కిసాన్ కాంగ్రెస్ నాయకులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, నగర గ్రామ స్థాయి నాయకులు, మహిళా కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

---

# ఎస్సీ హాస్టల్ విద్యార్థి మృతి ఘటనపై ఆగ్రహం

**● అధికారుల నిర్లక్ష్యంపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి**

**● యుఎస్‌ఎఫ్‌ఐ అఖిలపక్ష విద్యార్థి సంఘాలు**

**ఖమ్మం ప్రతినిధి, జనవరి 30 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఖమ్మం జిల్లా ఖమ్మం పట్టణ కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌కు చెందిన విద్యార్థి మూడు రోజుల క్రితం అదృశ్యమై, శుక్రవారం సాగర్ కాలువలో శవమై తేలిన ఘటన తీవ్ర కలకలం రేపుతోంది. ఈ విషాద ఘటనకు సంబంధిత అధికారుల నిర్లక్ష్యమే కారణమని యుఎస్‌ఎఫ్‌ఐతో పాటు అఖిలపక్ష విద్యార్థి సంఘాలు ఆరోపించాయి. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. హాస్టల్‌లో భద్రత, పర్యవేక్షణ లోపించడంతోనే ఈ దుర్ఘటన చోటు చేసు కుందని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, మృత విద్యార్థి కుటుంబానికి ప్రభుత్వం తరఫున రూ.3 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించనున్నట్లు ఖమ్మం జిల్లా ఎస్సీ కార్పొరేషన్ డీడీ, ఆర్డీవో ప్రకటించారు. అలాగే కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ లేదా ఔట్సోర్సింగ్ ఉద్యోగం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ ఘటనపై న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని విద్యార్థి సంఘాల నేతలు స్పష్టం చేశారు.



# కింజా, ఫ్యూజిమ్ డోర్స్ .. ఖర్చు తక్కువ భద్రత ఎక్కువ: ఎమ్మెల్సీ కోదండరాం

**భద్రత, మన్నికకు మారుపేరైన కింజా, ఫ్యూజిమ్ స్టీల్ డోర్స్**

**తెలంగాణలోనే మొట్టమొదటి షోరూం ఖమ్మంలో ప్రారంభం**

**72 నుంచి 80 మోడల్స్, ధరలు రూ.20 వేల నుంచి రూ.5 లక్షల వరకు**

**ప్రజలు ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి**









**ఖమ్మం ప్రతినిధి, జనవరి 20 (పిసిడబ్ల్యూ న్యూస్) :** కింజా, ఫ్యూజిమ్ స్టీల్ డోర్స్ ఖర్చు తక్కువ భద్రత ఎక్కువ అని ఎమ్మెల్సీ, తెలంగాణ జనసమితి రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. ఖమ్మం నగరంలోని శ్రీశ్రీ సర్కిల్ వద్ద కింజా, ఫ్యూజిమ్ స్టీల్ డోర్స్ ప్రీమియం షోరూమ్‌ను కంపెనీ చైర్మన్ మన్సూర్ ఆలీ, సీఈఓ సిద్దిక్ ఆలీ, జీఎం షరీఫ్ మహ్మద్, షేక్ మహబూబ్ పాషా తో కలసి ప్రొఫెసర్ కోదండరాం శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇంటి వాకిలే ఇంటి అందాన్ని, భద్రతను ప్రతిబింబిస్తుందని, ఇప్పుడు ఇంటి డోర్ల ద్వారానే ఇంటి గొప్పతనం చెప్పే స్థాయికి వచ్చామని అన్నారు. ఇండియా వ్యాప్తంగా నాణ్యతకు ప్రత్యేక గుర్తింపు పొందిన కింజా, ఫ్యూజిమ్ స్టీల్ డోర్స్ ప్రీమియం షోరూమ్‌ను తెలంగాణలో తొలిసారిగా ఖమ్మంలో ప్రారంభించడం అభినందనీయమని పేర్కొన్నారు. కంపెనీ చైర్మన్ మన్సూర్ ఆలీ, సీఈఓ సిద్దిక్ ఆలీ, జీఎం షరీఫ్ మహ్మద్ లు మాట్లాడుతూ.. మన్నిక, భద్రత, డిజైన్ పరంగా కింజా, ఫ్యూజిమ్ స్టీల్ డోర్స్‌కు సాటిలేదని అన్నారు. 72 నుంచి 80 మోడల్స్, ధరలు రూ.20 వేల నుంచి రూ.5 లక్షల వరకు ఉంటాయని తెలిపారు. తుప్పు పట్టదు, చెదలు రాదు, డోర్స్ ఎక్కువకాలం నాణ్యతతో నిలుస్తాయని చెప్పారు. ఖమ్మం వ్యాపార భాగస్వామి షేక్ మహబూబ్ పాషా మాట్లాడుతూ.. ప్రజలకు భద్రతతో పాటు తక్కువ ధరలో నాణ్యమైన ఉత్పత్తులు అందించాలనే ఉద్దేశంతో ఈ ప్రీమియం షోరూమ్‌ను ప్రారంభించామని, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి, డాక్టర్ షేక్ యాకూబ్, తెలంగాణ జన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపగాని శంకర్రావు, జిల్లా నాయకులు బట్టు రాజేందర్, సర్దార్, హుస్సేన్, జంగినపల్లి రవి, షేక్ నూర్జహాన్ బేగం, కాంగ్రెస్ రాష్ట్ర నాయకురాలు పగడాల మంజుల తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం ఖిల్లా రోప్‌వే పనుల పరిశీలన

- నాణ్యతకు రాజీ లేదు, వేగవంతంగా పూర్తి చేయాలి
- మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగత్స్య



**ఖమ్మం ప్రతినిధి, జనవరి 30 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఖమ్మం నగరంలో పర్యాటకాభివృద్ధిని మరింత ప్రోత్సహించాలనే లక్ష్యంతో ఖిల్లా వద్ద చేపడుతున్న రోప్‌వే పనులను శుక్రవారం మున్సిపల్ కమిషనర్ సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రోప్‌వే ప్రాజెక్ట్‌కు సంబంధించిన ప్రస్తుత పనుల పురోగతిని కమిషనర్ సమీక్షించారు. పనుల నాణ్యతలో ఎలాంటి రాజీ లేకుండా, ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలను తప్పనిసరిగా పాటిస్తూ నిర్ణీత గడువులో పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రోప్‌వే నిర్మాణం పూర్తయితే ఖమ్మం ఖిల్లాకు వచ్చే పర్యాటకులకు మెరుగైన సౌకర్యాలు లభించడంతో పాటు, నగర పర్యాటక రంగానికి గణనీయమైన ప్రోత్సాహం లభిస్తుందని కమిషనర్ తెలిపారు.

# బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరు బాధ్యతలు తీసుకోవాలి



**చిట్యాల జనవరి 30 (పిసిడబ్ల్యూ న్యూస్):** చిట్యాల మండలం లోని వెంచరామి దగ్గరలోని పురేళ్ల గట్టు జాతర లో జిల్లా కలెక్టర్ గారి ఆదేశాల మేరకు, జిల్లా సంక్షేమ అధికారి మల్లేశ్వరి సూచనలతో బాల్య వివాహాల నిర్మూలన లక్ష్యంగా జిల్లా మహిళ సాధికారత కేంద్రం ఆద్వర్యంలో అవగాహన కార్యక్రమం స్టాల్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో చిట్యాల MRO ఇమామ్ ,ఎఐ శ్రావణ్ కుమార్ అతిధులుగా పాల్గొని పోస్టర్ ఆవిష్కరణ చేశారు, మహిళ సాధికారత కేంద్రం ఇన్ ఛార్జ్ మిషన్ కో ఆర్డినేటర్ క్రిష్ణ మాట్లాడుతూ బాల్య వివాహాలు సమాజ అభివృద్ధికి అవరోధం అని తెలిపారు, బాల్య వివాహాలు బాలికల ఆరోగ్యం, విద్య, భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతాయని తెలిపారు. జెండర్ స్పెషలిస్ట్ అనూష మాట్లాడుతూ బాలికల రక్షణ, విద్యా ప్రాముఖ్యత, మహిళా సాధికారత అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ప్రజల చేత బాల్య వివాహ రహిత సమాజం కోసం ప్రతిజ్ఞ చేయించారు. జాతరలో దాదాపు 5 వేల మందికి పైగా అవగాహన కల్పించడం జరిగింది. కార్యక్రమంలో మహిళ సాధికారత సిబ్బంది మమత, సురేష్, పోలీస్ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది తదితరులు పెద్ద సంఖ్యలో! పాల్గొన్నారు.

# డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్శిటీ భవన నిర్మాణ పనులను పునః ప్రారంభించిన మంత్రి టీజీ భరత్

- **ఉర్దూ యూనివర్శిటీ నిర్మాణానికి రూ.కోటి విరాళం ఇచ్చిన మంత్రి టీజీ భరత్.**



**కర్నూలు జనవరి 30 (పిసిడబ్ల్యూ న్యూస్):** కర్నూలు విమానాశ్రయం సమీపంలో డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్శిటీ భవన నిర్మాణ పనులను మంత్రి టీజీ భరత్ పునః ప్రారంభించారు. శుక్రవారం కర్నూలు విమానాశ్రయం సమీపంలో, ఓర్వకల్లు వద్ద మంత్రి టి.జి. భరత్ , పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి తో కలిసి ఉర్దూ యూనివర్శిటీ భవన పునఃనిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఉర్దూ యూనివర్శిటీ నిర్మాణానికి తన వంతుగా రూ.1 కోటి విరాళం ఇచ్చామన్నారు.. తమ ప్రభుత్వం అధికారంలో కొనసాగి ఉంటే యూనివర్శిటీ భవన నిర్మాణం ఎప్పుడో పూర్తయ్యేదని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ప్రజలకు ఉపయోగపడే ఉర్దూ యూనివర్శిటీ, బీసీ భవన్, కాపు భవన్ వంటి ప్రాజెక్టులను ఆపేశారన్నారు. మైనార్టీ ముస్లిం వర్గాల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందని మంత్రి తెలిపారు. మంచి చేసే నాయకులను ప్రజలు గుర్తుంచుకోవాలని మంత్రి తెలిపారు. సరైన విద్యను అందించి, విద్యార్థుల జీవితాల్లో మార్పు తీసుకురావచ్చని, దావోస్ పర్యటనలో మంత్రి నారా లోకేష్ తో విద్యా వ్యవస్థ పై చర్చించానని మంత్రి వెల్లడించారు. మంత్రి నారా లోకేష్ విద్యా వ్యవస్థలో ఎన్నో మార్పులు తీసుకొస్తున్నారన్నారు. దావోస్ పర్యటనలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాన్ని బాగా ప్రమోట్ చేశామన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు రాష్ట్ర భవిష్యత్తు మార్చేస్తున్నారన్నారు. ఎన్నడూ లేని విధంగా కర్నూలు జిల్లాకు భారీగా పెట్టుబడులు తీసుకొస్తున్నామన్నారు. ఇప్పటికే రూ.10వేల కోట్ల పెట్టుబడుల పనులు మొదలయ్యాయని, రానున్న రోజుల్లో రూ.50 వేల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని మంత్రి పేర్కొన్నారు. పాణ్యం శాసనసభ్యులు గౌరు చరితా రెడ్డి మాట్లాడుతూ నవ్యాంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు 20142019 కాలంలో ఉర్దూ విశ్వవిద్యాలయాన్ని మంజూరు చేయడం ద్వారా మైనార్టీల విద్యాభివృద్ధికి బలమైన పునాది వేశారని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో విశ్వవిద్యాలయానికి సంబంధించిన పనులు ఆగిపోయాయని, ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత యూనివర్సిటీ పనులకు మళ్లీ ఊపు వచ్చిందని ఎమ్మెల్యే హర్షం వ్యక్తం చేశారు. ఈ విశ్వవిద్యాలయానికి అవసరమైన ప్రాథమిక మౌలిక వసతుల కోసం జిల్లా కలెక్టర్ ఫండ్స్ ద్వారా రూ.1 కోటి మంజూరు చేయడం జరిగిందని, అందులో రూ.50 లక్షలతో రోడ్ల నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. అదేవిధంగా, విశ్వవిద్యాలయ నిర్మాణానికి రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రివర్యులు టి.జి. భరత్ తన స్వంత నిధుల నుంచి రూ.1 కోటి ప్రకటించడం ఎంతో అభినందనీయమని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉర్దూ విశ్వవిద్యాలయ భవన నిర్మాణ పనులు పూర్తిచేయడానికి అవసరమైన నిధుల మంజూరుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ ప్రభుత్వ హయాంలోనే ఉర్దూ విశ్వవిద్యాలయ నిర్మాణ పనులను పూర్తిచేసి, విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొస్తామని స్పష్టంచేశారు. అలాగే, మైనార్టీ ముస్లిం వర్గాల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందని, విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఇమామ్‌లు మరియు మౌజన్లకు గౌరవ వేతనాలను పెంచడం వంటి చర్యల ద్వారా వారి జీవన ప్రమాణాలు మెరుగుపరుస్తోందని తెలిపారు. ఇక ఓర్వకల్లు ప్రాంతాన్ని రాష్ట్రంలోనే ముఖ్యమైన ఇండస్ట్రియల్ హబ్‌గా అభివృద్ధి చెందుతుందని, ఇప్పటికే అనేక పెట్టుబడులు వస్తున్నాయని, దీని ద్వారా స్థానిక యువతకు విస్తృత స్థాయిలో ఉపాధి అవకాశాలు కలుగుతాయని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ షా వలి ఖాన్, పారిశ్రామికవేత్త బి.కె సింగ్, ఉర్దూ యూనివర్శిటీ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ లెజెండ్ కేసీఆర్... ఆ ముద్రను ఎవరూ చెరపలేరు

- కేసీఆర్‌పై కుట్రలు ఎంత చేసినా ప్రజలే గుణపాఠం చెబుతారు
- రాజకీయ కక్షసాధింపులు మానుకోండి.. లేకపోతే ప్రజా పోరాటం తప్పదు
- గంగన్నగూడ టిఆర్ఎస్ యూత్ ప్రెసిడెంట్ పవన్ కళ్యాణ్ తీవ్ర ఆగ్రహం



**షాద్ నగర్,జనవరి 30 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ ఉద్యమానికి ప్రాణం పోసిన నాయకుడు, రాష్ట్ర ఆవిర్భావానికి మార్గదర్శకుడు, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్)పై జరుగుతున్న చర్యలు పూర్తిగా రాజకీయ వేధింపులేనని గంగన్నగూడ బీఆర్ఎస్ పార్టీ యూత్ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ మండిపడ్డారు. కేసీఆర్‌కు నోటీసులు జారీ చేయడం ప్రజాస్వామ్యానికి మచ్చతెచ్చే చర్యగా ఆయన అభివర్ణించారు. తెలంగాణ రాష్ట్ర నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన నాయకుడిపై ఇలాంటి విచారణలు ప్రారంభించడం వెనుక రాజకీయ కుట్ర కక్షసాధింపే ఉన్నదని ఆయన ఆరోపించారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని ప్రతిపక్ష నేతలను తీవ్ర ఇబ్బందులకు గురి చేయడం ప్రజాస్వామ్య వ్యవస్థల దుర్వినియోగానికి నిదర్శనమని విమర్శించారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం చావు అంచులలో అడుగు పెట్టి నిరాహార దీక్షలు, పోరాటాలు చేసి రాష్ట్రాన్ని సాధించిన నాయకుడే కేసీఆర్ అని గుర్తుచేశారు. అలాంటి నాయకుడిని ప్రజల్లో దెబ్బతీయాలనే ఉద్దేశంతోనే ఈ నోటీసులు జారీ చేస్తున్నారని పవన్ కళ్యాణ్ అన్నారు. ఒక రాష్ట్ర పునర్నిర్మాతను రాజకీయంగా బలహీనపరచాలని చూస్తే ఎట్టి పరిస్థితుల్లో ప్రజలు సహించారని, కెసిఆర్ పై జరుగుతున్న పరిణామాలు ప్రతి ఒక్కరు గమనిస్తున్నారని, కెసిఆర్ పై కుట్రలు చేసే వారిపై ప్రజలు కర్రు కాల్చి వాత పెట్టేందుకు సిద్ధంగా ఉన్నారని ఈ సందర్భంగా తెలిపారు. సంక్షేమ పథకాలతో ప్రజల హృదయాల్లో కేసీఆర్ కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన రైతు బంధు, రైతు భీమా, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, దళితబంధు వంటి సంక్షేమ పథకాలు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచాయని తెలిపారు. ఇలాంటి నోటీసులతో ఆయన ప్రజాదరణను తగ్గించడం అసాధ్యమని చెప్పారు. ప్రజల మద్దతే కేసీఆర్ అసలైన బలమని పేర్కొన్నారు. ప్రభుత్వ యంత్రాంగాన్ని ఉపయోగించి రాజకీయ ప్రత్యర్థులను లక్ష్యంగా చేసుకోవడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని విమర్శించారు. పాలకులు అభివృద్ధిపై దృష్టి పెట్టకుండా కక్షసాధింపులకు దిగడం బాధాకరమన్నారు. పోరాటానికి సిద్ధంమున్సిపల్ ఎన్నికల సమయంలో ఇలాంటి దిగజారుడు చర్యలు కొనసాగితే గ్రామస్థాయిలోనే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని పవన్ కళ్యాణ్ హెచ్చరించారు. ప్రజా నాయకుడిపై దాడి అంటే ప్రజలపై దాడి చేసినట్టే. అవసరమైతే రోడ్డెక్కి పోరాడతామని స్పష్టం చేశారు.

# జిల్లాలో బాల్య వివాహాల నిర్మూలనకు ప్రత్యేక కృషి




**ఆదోని, ఎమ్మిగనూరు జనవరి 30 (పిసిడబ్ల్యూ న్యూస్):** జిల్లాలో బాల్య వివాహాల నిర్మూలన కు ప్రత్యేక కృషి చేస్తున్నట్లు జిల్లా మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ అధికారి పి. విజయ అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బాల్య వివాహ ముక్త భారత్ నవంబర్ 27 నుండి మార్చి 8వ తేదీ వరకు నిర్వర్తిస్తున్న వంద రోజుల ప్రణాళికలో భాగంగా డివిజన్ స్థాయిలో శుక్రవారం ఎమ్మిగనూరు మండలం గుడికల్ గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో, ఎమ్మిగనూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో బాల్య వివాహ నిర్మూలనపై రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ అధికారి పి విజయ మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరం అని తెలిపారు. బాల్య వివాహాలు జరిపితే, అమ్మాయిని తీసుకువెళ్లి, బాల సదనం లో ఉంచి, 18 ఏళ్లు నిండిన తర్వాతనే తల్లిదండ్రులకు అప్పగించడం జరుగుతుందన్నారు. బాల్య వివాహాలు చేస్తే పెళ్ళి చేసిన తల్లిదండ్రులకే కాదు, పెళ్ళిచూపులకు తీసుకువచ్చిన మధ్యవర్తితో మొదలుకుని పెళ్ళి చేసిన పురోహితుడు, ఫంక్షన్ హాల్ ఓనర్, పెళ్లి కార్డులు ముద్రించిన ప్రచురణకర్త , పెళ్లికి వచ్చిన అతిథులు అందరూ కూడా చట్టప్రకారం శిక్షకు అర్హులే అని తెలిపారు. మండల స్థాయిలో తహసీల్దార్ బాల్య వివాహాల నిరోధక అధికారి గా వ్యవహరిస్తారని, గ్రామస్థాయిలో ఉన్న బాల్య వివాహ నిషేధ అధికారులు పంచాయతీ సెక్రెటరీ, విఆర్ఓ మహిళ పోలీసులు కచ్చితంగా జీవో.31 ప్రకారము తమ విధులను నిర్వర్తించాలన్నారు. గ్రామస్థాయిలో బాలబాలికల తల్లిదండ్రులు చదివించుకోలేని స్థితిలో ఉన్న బాలలకు విద్యా, వసతి, పునరావాసము కల్పించడానికి జిల్లా స్థాయిలో రెండు బాలసదనాలు ఉన్నాయని, ఇలాంటి వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డి.ఎస్.పి భార్గవి మాట్లాడుతూ చిన్న వయసులో బాల్య వివాహాలు చేయడము వల్ల బాలికల బంగారు భవిష్యత్తుకు ఆటంకం ఏర్పడుతుందన్నారు. ముఖ్యంగా బాల్య వివాహాలు చేయడానికి తల్లిదండ్రులు ప్రయత్నాలు మొదలుపెట్టే క్రమంలోనే ముందుగానే సమాచారం ఇవ్వడం వల్ల వెంటనే తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చి బాల్య వివాహాలు వారు చేయకుండా నిలుపుదల చేయవచ్చని తెలిపారు.. ఈ సమాచారం ముందుగా తెలపడం వల్ల బాలికలను రక్షించడానికి ఉపయోగపడుతుందని తెలియజేశారు. ఈ బాల్య వివాహం వల్ల వచ్చే అనర్థాల, ఇబ్బందులు, ఆ బాలికలు ఎదుర్కొనే శారీరక మరియు మానసిక ఇబ్బందుల గురించి వివరించారు.